# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 73 | విశాఖపట్నం | 13-12-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 73 | VISAKHAPATNAM | 13-12-2025 SATURDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి..

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


# ఒక విజన్‌తో ముందుకెళ్తున్నాం..
# అద్భుతాలు సాధిస్తున్నాం: చంద్రబాబు




- **కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు చంద్రబాబు శంకుస్థాపన**
- **మరో ఏడు ఐటీ సంస్థలకు చంద్రబాబు భూమి పూజ**

(విశాఖపట్నం, పతాకం న్యూస్)

ఒక విజన్‌తో ముందుకెళ్తూ అద్భుతాలు సాధిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి సీఎం, ఐటీ మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. కాగ్నిజెంట్, సత్వా సంస్థతో పాటు మరో ఏడు ఐటీ సంస్థలకు భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి విశాఖపట్నం కేంద్రంగా మారబోతోందని చెప్పారు. ఎకనమిక్ రీజియన్ కింద నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. "కాగ్నిజెంట్‌కు భారత్‌లో ఐదు సెంటర్లు చెన్నై, హైదరాబాద్, పుణె, బెంగళూరు, కోల్‌కతాలో ఉన్నాయి. హెల్త్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రొడక్ట్స్ అండ్ రిసోర్సెస్ రంగాల్లో ముందున్నారు. భారత్ నుంచే 2,41,500 మంది కాగ్నిజెంట్ సంస్థకు పని చేస్తున్నారు. వీరిలో దాదాపు 80 శాతం మంది భారతీయులే. సంస్థ చీఫ్ కూడా మన దేశానికి చెందిన వ్యక్తే అదీ మన భారతీయుల శక్తి. ఒకవైపు సముద్రం, మరోవైపు కొండలతో అందంగా ఉండే ప్రాంతం విశాఖపట్నం. త్వరలో ఇక్కడికి మెట్రో కూడా వస్తుంది. అన్ని విధాలుగా అనుకూలమైన నగరమిది. ఒక విజన్‌తో ముందుకెళ్తున్నాం, అద్భుతాలు సాధిస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

"ఎకనమిక్ రీజియన్ కింద విశాఖను అభివృద్ధి చేస్తున్నాం. నెట్ జీరో కాన్సెప్ట్ తీసుకొచ్చి విశాఖను కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం. ఇటీవల విశాఖ పెట్టుబడుల సదస్సులో 613 ఎంవోయూలు జరిగాయి. ఏడాదిలో ఇన్ని సంస్థలు పెట్టుబడులకు వచ్చాయంటే గేమ్ ఛేంజర్‌గా మారింది. ఇవన్నీ పూర్తయితే 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. నాలెడ్జ్ ఎకానమీకి విశాఖ చిరునామాగా తయారవుతుంది.

అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంది, భారత్‌కు క్వాంటం వ్యాలీ ప్రారంభమైంది. క్వాంటం వ్యాలీకి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ కాబోతోంది. ప్రశాంతమైన, అందమైన ప్రాంతం విశాఖ. నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి కేంద్రంగా విశాఖ మారబోతోందన్నారు.

త్వరలోనే విశాఖలో మెట్రో వస్తుంది. టెక్ తమ్మిన, నాన్‌రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్‌కు భూమిపూజ చేసుకున్నాం. ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేసుకున్నాం. మదర్సన్ టెక్నాలజీ, క్వార్క్ టెక్నోసాఫ్ట్ సంస్థలకు భూమిపూజ చేసుకున్నాం." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

---



2లో

## చింతూరు బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

---

వరల్డ్ కప్ గెలిచిన భారత అంధుల మహిళల జట్టుకు

## పవన్ ఘన సత్కారం

2లో



---


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


## అటల్ నుంచి మోడీ వరకు సుపరిపాలన యాత్ర ప్రజలకు గుర్తుండాలి: పయ్యావుల

**అనంతపురం, పతాకం న్యూస్::** అనంతపురంలో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆవిష్కరించారు. అటల్ శతజయంతి వేడుకల్లో భాగంగా ధర్మవరం నుంచి బయల్దేరిన అటల్-మోదీ సుపరిపాలన బస్సుయాత్రకు అనంతపురంలో కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్ నుంచి గుత్తి రోడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గుత్తి రోడ్డులో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని కేశవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి



సత్యకుమార్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు. వాజ్‌పేయి శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పయ్యావుల కేశవ్ మాట్లాడారు. 'భారతదేశాన్ని అణుశక్తిలో శక్తివంతం చేసిన ఘనత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిదే. వాజ్‌పేయి పాలన కాలంలో అభివృద్ధి పరుగులు తీసింది. అదే స్ఫూర్తితో మోడీ చేస్తున్నారు. దానికి నిదర్శనంగా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వాజ్‌పేయి భారత్‌ను కూడా అణుశక్తి దేశంగా మార్చి ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### అభివృద్ధి?

రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదు. దేశంలోనే అభివృద్ధిలో, సంక్షేమంలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే ప్రకటిస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తే- తాము వాటిని గాడిలో పెట్టి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని ఆయన చెబుతున్నారు. ఒక సెక్షన్ మీడియా అభివృద్ధి కథనాలను వండి వడ్డి స్తుండటంతో సామాన్యులు గందరగోళంలో చిక్కు కుంటున్నారు. దీంతో రోజువారీ జీవితానుభవాల నుండే నిర్ధారణకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో గత ప్రభుత్వం ధ్వంసం చేసిన ఎపి బ్రాండ్ ఇమేజ్‌ను తాము పునరు ద్ధరించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో పలు కార్పొరేట్ దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడాన్ని దీనికి నిదర్శనంగా ప్రభుత్వం చెబుతోంది. ఈ త్రైమాసికంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి 11.28 శాతంగా నమోదైందని, అదే సమయంలో జాతీయ సగటు 8.7 శాతమే అని చంద్రబాబు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 17.11 శాతం జిఎస్‌డిపిని సాధించడం లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తలసరి ఆదాయం, జిఎస్‌డిపిలో అన్ని రంగాల వాటా గణనీయంగా పెరుగుతోంది. దీంతో రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకెళ్లడం ఖాయమని ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో మరి కొన్ని గణాంకాలు దీనికి భిన్నమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తుండటం గమనార్హం. సర్కారు లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి సగటున రూ.92 వేలకు పైగా రుణ భారం ఉంది. రానున్న రోజుల్లో ఇది మరింతగా పెరగనుంది. ఇలా తెస్తున్న అప్పుల్లో అధిక శాతాన్ని సంక్షేమ పథకాల అమలు కోసమే ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. నిజంగా సంక్షేమం కోసమే అని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే, ప్రజల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి గణనీయంగా పెరగాలి. కానీ, క్షేత్రస్థాయిలో దానికి భిన్నమైన పరిస్థితులు కనపడుతుండటంతో 'సర్కారీ రుణం' లెక్కలు సందేహాస్పదంగా మారుతున్నాయి. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న మొత్తం సంగతి ఎలా ఉన్నప్పటికీ నిత్యావసర వస్తువుల ధరలు పైపైకే పరుగులు తీస్తున్నాయి. కూరగాయలు, పప్పులు, వంటనూనె ధరలు రెండంకెల పెరుగుదలతో సామాన్యుడిని కుదిపేస్తున్నాయి. పథకాల ద్వారా నెలకు కొద్దిపాటి నగదు చేతికి వచ్చినా, మరోవైపు విద్యా ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు ఆ మొత్తాన్ని మింగేస్తున్నాయి. రైతులకు పంట ధరలు గిట్టుబాటు కాకుండా పోతున్నాయి. వరి, టమాటా, ఉల్లి, అరటి %% ఇలా అన్ని పంటల ధరలూ పతనోన్ముఖం పట్టడంతో రైతులు ఆవేదనతో రోడ్డెక్కుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కొరత, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వంటి మౌలిక లోపాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రభుత్వం ఎన్ని మాటలు చెబుతున్నప్పటికీ, రాష్ట్రంలో నిరుద్యోగం 20 నుండి 21 శాతం వరకు ఉందని తాజా సర్వేలు చెబుతున్నాయి. ఉన్న ఉద్యోగాలు కూడా అరకొరగానే భద్రత కల్పిస్తున్నాయి. ప్రైవేటు రంగ ఉద్యోగాలు అస్థిరంగా మారుతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ పనిదినాలు ఒకవైపు తగ్గిపోతుం డగా, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే పనులను ప్రభు త్వాలే చేస్తున్నాయి. పనులు లేని యువత గంజాయికి, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడి సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్న సంఘటనలను చూస్తున్నాం. ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న వృద్ధి ఎవరికి దక్కుతోందన్న ప్రశ్న ముందుకు వస్తోంది! ఇప్పటికే దేశంలో అంతరాలు పెరుగుతున్నట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శల సంగతి ఎలా ఉన్నప్పటికీ, కీలకమైన విధానాల్లో మార్పు రానంతవరకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మెరుగుపడవు.

## కుప్పకూలిన రూపాయి..
### చారిత్రక కనిష్టానికి భారత కరెన్సీ



**అమరావతి, పతాకం న్యూస్:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ సరికొత్త రికార్డు కనిష్టానికి పడిపోయింది. నిన్నటి ట్రేడింగ్‌లో రూపాయి విలువ తొలిసారిగా 90.42 స్థాయికి చేరింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడంతో వచ్చిన సానుకూలతను దేశీయ కార్పొరేట్లు, బ్యాంకుల నుంచి డాలర్లకు వెల్లువెత్తిన డిమాండ్ తోసిపుచ్చింది. దీంతో రూపాయిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. విదేశీ, ప్రైవేట్ బ్యాంకులు తమ మర్చంట్, కార్పొరేట్ చెల్లింపుల కోసం పెద్ద ఎత్తున డాలర్లను కొనుగోలు చేస్తున్నాయని ట్రేడర్లు చెబుతున్నారు. "ప్రపంచ పరిణామాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దేశం నుంచి డాలర్ల అవుట్‌ఫ్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది" అని ఓ బ్యాంకర్ రాయిటర్స్‌తో తెలిపారు. ఈ కారణంగానే రూపాయి కోలుకోలేకపోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, 2022 తర్వాత రూపాయికి ఇది అత్యంత నిరాశాజనకమైన సంవత్సరం కానుంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల్లో అనిశ్చితి, భారత ఎగుమతులపై అమెరికా టారిఫ్‌లు వంటి అంశాలు ఈ ఏడాది రూపాయి పతనానికి కారణమయ్యాయి. వాషింగ్టన్‌తో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే రూపాయి మరింత బలహీనపడవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మార్కెట్ వర్గాల దృష్టి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వైపు మళ్లింది. వచ్చే వారం ఆర్‌బీఐ 5 బిలియన్ డాలర్ల డాలర్-రూపీ బై/సెల్ స్వాప్ నిర్వహించనుంది. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యత (లిక్విడిటీ) పెరిగి, స్వల్పకాలిక ఒత్తిడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. "రూపాయి దాని స్థాయిని అదే కనుగొంటుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. రూపాయి బలహీనతను రాజకీయం చేయవద్దని కోరారు. గతంలో తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన ఆర్థిక వ్యవస్థ కారణంగా రూపాయి పతనం మరింత ఆందోళన కలిగించిందని, ప్రస్తుత ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని ఆమె గుర్తుచేశారు.

## చింతూరు బస్సు ప్రమాద బాధితులకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో బస్సు ప్రమాద బాధితులకు ఎపి ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. శుక్రవారం ఉదయం చింతూరు నుండి మారేడుమిల్లి వెళుతున్న బస్సు ఘాట్‌రోడ్ వద్ద అదుపుతప్పిలోయలో పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 9మంది మరణించగా, పలువురికి గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ. 5లక్షలు, క్షతగాత్రులకు రూ. 2లక్షల పరిహారం ప్రకటించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, జిల్లా సబ్ కలెక్టర్, ఇతర అధికారులు ఉన్నారు.

## ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా లో జిల్లా, ఏరియా, సామాజిక ఆసుపత్రి లోపనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనం అమలు చేయాలనీ ఏ.పి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించి డిసిహెచ్ఎస్ శ్రీనివాసరావు, సూపరిండెంట్ కృష్ణరావు లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా లక్ష్మణ మాట్లాడుతూ జీవో 138 ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి రూ. 16 వేలు వేతనంలో కార్మికుని పిఎఫ్, ఈఎస్ఐ వాటగా రూ. 2040లు మినహాయించి రూ. 13960 వేలు ప్రతినెలా ఏడవ తేదీ లోపు చెల్లించాల్సి ఉంది. అలాగే సూపర్వైజర్లకు రూ. 21వేలు వేతనం చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంగించి వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. కార్మికులకు చట్టప్రకారం ఉద్యోగ నియామక పత్రం ఇవ్వాలని అలాగే సం.కి 3 జతల యూనిఫామ్, నెలకు 4 వారాంతపు విశ్రాంతి దినములతో పాటు సం.కి 15 సాధారణ, 15 రోజులు వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సంస్థలలో రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా షిఫ్ట్ విధానం అమలు చెయ్యాలని కోరారు. కార్యక్రమం లో ఏఐటీయూసీ నాయకులు బి. రవికుమార్, ఆసుపత్రి కార్మికులు వడ్డాది పోలరావు, వడ్డాది అప్పలరాజు, నూకరాజు, ఎర్రంశెట్టి వెంకట లక్ష్మి, వరలక్ష్మి, జ్యోతి, నాగమణి, పద్మావతి, జగన్నాధం రావు, స్వాతి దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ఘోర బస్సు ప్రమాదం..
### ప్రధాని మోడీ పరిహారం ప్రకటన



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. యాత్రికులతో వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు లోయలో పడిపోవడంతో 9 మంది దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు జిల్లాకు చెందిన 37 మంది యాత్రికులు ఓ ప్రైవేటు బస్సులో భద్రాచలం దర్శనం ముగించుకుని అన్నవరం బయలుదేరారు. చింతూరు-నరెడుమిల్లి ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తుండగా ఓ ప్రమాదకరమైన మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోయారు. దీంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న భద్రతా గోడను ఢీకొని లోతైన లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 8 మంది అక్కడికక్కడే చనిపోయారు. ప్రమాదం జరిగిన ప్రాంతం మారుమూల అటవీ ప్రాంతం కావడంతో అక్కడ మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో సమాచారం అధికారులకు ఆలస్యంగా చేరింది. విషయం తెలుసుకున్న మోతుగూడెం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మృతదేహాలను వెలికితీసి, క్షతగాత్రులను ఐదు పోలీస్ వాహనాలు, మూడు అంబులెన్సుల సహాయంతో చింతూరులోని ఆసుపత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధితుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీఎం చంద్రబాబు కూడా ఈ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధితుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు.

## విశాఖ నగరాలతో కాదు... ప్రపంచంతో పోటీ పడుతోంది: మంత్రి నారా లోకేశ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం ఇప్పుడు దేశంలోని ఇతర నగరాలతో కాకుండా ప్రపంచంతో పోటీ పడుతోందని, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు విశాఖను ఒక పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ విశాఖలో తన శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయడం చారిత్రక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. శు క్రవారం నాడు విశాఖ మధురవాడలో కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న తీరును, భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ సుమారు రూ. 1500 కోట్ల పెట్టుబడితో విశాఖలో తన కార్యకలాపాలు ప్రారంభించడం ఒక కొత్త టెక్ యుగానికి నాంది అని లోకేశ్ అన్నారు. ఈ పెట్టుబడి ద్వారా తొలుత 8 వేల మందికి, భవిష్యత్తులో 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇప్పటికే వెయ్యి మందితో తాత్కాలిక క్యాంపస్‌ను కూడా ప్రారంభించామని, ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, కాగ్నిజెంట్‌కు, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మధ్య బలమైన భాగస్వామ్యానికి ఆరంభమని పేర్కొన్నారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి సారిస్తుందని, తద్వారా విశాఖ డిజిటల్ ఎకోసిస్టమ్ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. ఈ క్యాంపస్‌లోని ప్రతి సీటు కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, మన యువత కలలకు, భవిష్యత్తుకు వేదిక అని అన్నారు. కాగ్నిజెంట్‌లో పనిచేసే ఉద్యోగులంతా విశాఖకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని 25 ఏళ్ల యువకుల్లా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, వారి నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. రాష్ట్రంలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు సృష్టించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆంధ్రప్రదేశ్, విశాఖ, తెలుగు ప్రజలు గర్వపడేలా చేద్దామని అన్నారు.

## భూ కబ్జాదారులపై ఎల్ టి ఆర్ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



**రంపచోడవరం, పతాకం న్యూస్ :** శుక్రవారం నాడు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసి భూములు కబ్జా చేస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంగిస్తున్న నాన్ ట్రైబల్స్ పై క్రిమినల్ కేసులు ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం నందు ఏపీఓ కు, రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంకు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ టి ఆర్ కార్యాలయంలో మరియు రంపచోడవరం తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ బ్రతుకుదేరువు కోసం ఏజెన్సీ ప్రాంతాలకు ఏజెన్సీ ఉల్లంఘించి చట్ట విరుద్ధంగా వలస వచ్చిన నాన్ ట్రైబల్స్ ఆదివాసుల అమాయకత్వాన్ని మంచితనాన్ని ఆసరగా చేసుకొని ఆదివాసి భూములను కబ్జా చేసి తిరిగి ఆదివాసులపైనే దౌర్జన్యాలకు దాడులకు దిగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు ఏజెన్సీ చట్టాలను అమలు చేయడంలో విఫలం అవుతున్నారని చట్టాలు పరిరక్షణ కోసం, హక్కులు సాధన కోసం ఆదివాసి సంక్షేమ పరిషత్ చేస్తున్న పోరాటాలలో ఆదివాసులు పార్టీలకు అతీతంగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమములో ఆదివాసి సంక్షేమ పరిషత్ సీనియర్ నాయకులు బొరగా గంగరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాలో యాత్రికుల బస్సు బోల్తా.. 9 మంది దుర్మరణం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. యాత్రికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన 35 మంది యాత్రికులు, ఇద్దరు డ్రైవర్లతో ఓ ప్రైవేటు బస్సు భద్రాచలంలో దర్శనం ముగించుకుని అన్నవరం బయలుదేరింది. చింతూరు–మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని రాజుగారిమెట్ట వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 37 మంది ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న చింతూరు పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో యాత్రికుల బంధువుల స్వస్థలమైన చిత్తూరు జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## సీఐటీయూ అఖిలభారత మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి నాలుగు వరకు జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ద్వారకా తిరుమలలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పట్టణంలో వి.పేట, దుంపగడప రైస్ మిల్లుల కూడలి వద్ద రైస్‌మిల్లు కార్మికులతో ప్రచారం చేపట్టారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద చలో విశాఖ వాల్‌పోస్టర్‌ను అంగన్‌వాడీలతో కలిసి సిఐటియు నేతలు ఆవిష్కరించారు. విశాఖలో జివిఎంసి 59వ వార్డు పరిధి ములగాడ, హౌసింగ్ కాలనీల్లో సిఐటియు నేతలు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కె.కోటపాడు మండలం ఆనందపురంలో ఆటో కార్మికులు రూ.1000 విరాళం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం, నంద్యాల జిల్లా వెలుగోడు, ప్రకాశం జిల్లా దోర్నాలలోని ఐసిడిఎస్ కార్యాలయంలో, గుంటూరు జిల్లా తాడేపల్లిలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్ మాట్లాడుతూ.. ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి బి.గోవిందు పాల్గొన్నారు.

## 16 నుండి రసజ్ఞ బహు భాషా జాతీయ నాటకోత్సవాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ ఈ నెల 16వ తేదీ నుండి మూడు రోజుల పాటు బహు భాషా నాటకోత్సవాలు నిర్వహిస్తుంది. మద్దిలపాలెం కళాభారతి వేదికగా ఈ బహు భాషా జాతీయ నాటకోత్సవాలు వరుసగా 10వ సారి జరుపుతుంది. ఈ విషయాన్ని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు వెల్లడించారు. సాయంత్రం తన ఛాంబర్ లో మేయర్ పీలా శ్రీనివాసరావు ఈ జాతీయ నాటకోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖల సమన్వయంతో నిర్వహించే ఈ బహు భాషా నాటకోత్సవాల వివరాలను ఆయన వెల్లడించారు. తొలి రోజు అయిన మంగళవారం కోలాటం, జానపద నృత్యాలు ఉంటాయి. విశిష్ట సేవా పురస్కారాలను తెలుగు యూనివర్సిటీ ఆచార్యులు బి హెచ్ పద్మప్రియ కు, పాండిచేరి యూనివర్సిటీ డా.పవిత్ర కు ఎయు అతిథి అధ్యాపకురాలు డి. హేమా వెంకటేశ్వరి లకు విశిష్ట రంగ సేవా పురస్కారాలు 2025 ప్రదానం చేస్తారు. అనంతరం ఒకే ఒక్క సారి తెలుగు నాటకం బి.శ్రీనివాసరావు రచనను బి.మంజునాథ్ దర్శకత్వంలో సిరిమువ్వ కల్చర్స్ హైదరాబాద్ సభ్యులు ప్రదర్శిస్తారు. 17వ తేదీ బుధవారంబెంగాలీ సంప్రదాయ జానపద నృత్యాలు ప్రదర్శిస్తారు. అదే రోజు కొన్ని బంగ్లా / హిందీ పాటలు కూడా ఆయా గాయకులు పాడుతారు. చిత్రాంగద నృత్య నాటకం విశాఖ బెంగాలీ బెంగాలీ కళాకారులు ప్రదర్శిస్తారు. డాలియా బెంగాలీ నాటకం డెబాసిస్ దత్ దర్శకత్వంలో ప్రదర్శిస్తారు. రచన రవీంద్రనాథ్ ఠాగూర్. ఈ నాటకానికి ముందు గరిమాకరమాకర్ హిందీ బెంగాలీ గీతాలాపన ఉంటుంది. 18వ తేదీ గురువారం స్నిగ్ధ రాసినధన్యోస్మి నాటకం డా.వేమలి త్రినాథరావు – డి. హేమా వెంకటేశ్వరి దర్శకత్వం లో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ సభ్యులు ప్రదర్శిస్తారు. అనంతరం దండు నాగేశ్వర రావు రాసిన ముళ్ళ తీగలు నాటక ప్రదర్శితం అవుతుంది. దీనికి పివిఆర్ మూర్తి దర్శకత్వంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శిస్తారు. ప్రారంభంలో జానపద నృత్యాల ప్రదర్శన కూడా చోటుచేసుకుంటాయి. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖల సహకారంతో ఈ బహు భాషా నాటకోత్సవాలు ఏర్పాటవుతున్నాయి. కాప్టన్ సర్వీసెస్ లిమిటెడ్, ల్యాండ్ పవర్ రియల్ ఎస్టేట్, సీఎంఆర్, కంకటాల సౌజన్యంతో ఈ బహు భాషా నాటకోట్సవాలు ఏర్పాటవుతున్నాయని రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు డా వేమలి త్రినాథ్ రావు తెలిపారు. ఈ ప్రదర్శనలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత పీలా తిలక్, అక్షర సారధి జర్నలిస్ట్ బొడ్డేటి సూర్య చంద్ర శేఖర్, రాపేటి గోవింద్, జె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను పరిశీలించిన ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం



**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కమిషన్ సభ్యుడు కిల్లో సాయిరాం గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను పరిశీలించారు. డుంబ్రిగూడ మండలం కిల్లోగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం సందర్శించిన ఆయన, సిబ్బంది పనితీరును అభినందించారు. ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కుమార్ రత్నం, డాక్టర్ నజీ ముల్లలు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. సాయిరాం గారు వార్డులు, ఫార్మసీ గది, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించి, పారిశుధ్యం పాటించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వచ్చే రోగులకు సరైన సలహాలు ఇవ్వాలని డాక్టర్లకు వివరించారు. రోగులతో మాట్లాడిన ఆయన, “గిరిజన ప్రజానీకానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను” అని అన్నారు. డాక్టర్లు, సిబ్బందిని ప్రశంసించారు. సిబ్బంది కొత్త అంబులెన్స్ కోరగా, ఈ సమస్యను ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

## గజగజ వణుకుతున్న మన్యం



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో రోజు రోజుకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండడంతో చలి తీవ్రత క్రమంగా పెరుగుతున్నది. దీంతో మన్యం వాసులు గజగజ వణుకుతున్నారు. గత మూడు రోజులుగా కొయ్యూరు మండలం మినహా మిగతా పది మండలాల్లోనూ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. జి.మాడుగులలో 3.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. డుంబ్రిగుడలో 3.6, అరకులోయలో 3.9, ముంచంగిపుట్టులో 4.4, హుకుంపేటలో 5.4, పాడేరులో 6.7, పెదబయలులో 7.1, చింతపల్లిలో 7.8, కొయ్యూరులో 11.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ముంచంగిపుట్టు మండలం పరిధిలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. మండల కేంద్రంలో మంచు దట్టంగా కురిసింది. ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు వీడలేదు. అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి మొదలవుతోంది. రాత్రి వేళల్లో ఎక్కడ చూసినా చలిమంటలు కనిపిస్తున్నాయి.

## 20న ఎన్టీఆర్ ఆసుపత్రిలో ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్



**అనకాపల్లి, పతాకం న్యూస్** ఎమ్మెల్యే కొణతాల సూచనలతో ఈ నెల 20న ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించనునట్లు డిఎంఅండ్ హెచ్ ఓ ఎం. హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజియోథెరపీకి రోజురోజుకు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలోని తన చాంబర్ లో శుక్రవారం ఆమె ఆసుపత్రి డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతి కుమారి రామకృష్ణ, గొర్లి శేఖర్, ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ప్రియాంక పట్నాయక్ (ఎన్నారై) తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉరుకుల పరుగుల జీవితంలో సరైన ఆహారం నియమాలు పాటించని అనేకమందిని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా ఎముకలు, నరాలు, గుండె సంబంధిత వ్యాధులు బాధిస్తున్నాయని చెప్పారు. కాగా కొద్దిపాటి వ్యాయామంతో పాటు ఫిజియోథెరపీ ద్వారా ఇలాంటి సమస్యలను తేలికగా అధిగమించవచ్చని డిఎంఅండ్ హెచ్ ఓ హైమావతి తెలిపారు. ఫిజియోథెరపీకి ప్రాచీన కాలం నుంచి మంచి ఆదరణ ఉందన్నారు. సకాలంలో సేవలు అందిస్తే ఖచ్చితంగా చక్కటి ఫలితాలు వస్తాయని ఆమె పేర్కొన్నారు. మెడ, నడుము, మోకాలు, తుంటి ఎముకలు తదితర నొప్పులతో ప్రస్తుతం అనేకమంది సతమతమవుతున్నారని తెలిపారు. 40 ఏళ్ల వయసు దాటిన వారిలో 60 నుంచి 70 శాతం మందిలో మోకాళ్ళ చిప్పలు అరుగుదల కనిపిస్తోందని పేర్కొన్నారు. వీటన్నిటికీ ఫిజియోథెరపీ శాశ్వత పరిష్కారం చూపుతోందని తెలిపారు. పక్షవాతం వంటి సమస్యలకు ఫిజియోథెరపీలో చక్కటి ఫలితాలు లభిస్తున్నాయని వెల్లడించారు. మాజీమంత్రి కొణతాల రామకృష్ణ సూచనల మేరకు ఆయన విజ్ఞప్తితో ఎన్నారై ఫిజియోథెరపీ వారి సౌజన్యంతో ఈనెల 20న స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి నడుము, ముడుకులు, పక్షవాతంతో ఉన్నవారికి ఫిజియోథెరపీపై అవగాహన కలిగించి అవసరమైన వారికి వైద్య సేవలు కూడా అందించనున్నట్లు తెలియజేశారు.

## నర్సీపట్నంలో డివిజనల్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం డివిజనల్ స్థాయిలో ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీలు బాలికల గవర్నమెంట్ జూనియర్ కాలేజీ నర్సీపట్నం గ్రౌండ్‌లో ఘనంగా జరగనున్నాయని నర్సీపట్నం ఎమ్ఈఓ సీహెచ్ తలుపులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి మొత్తం 12 మండలాల నుండి మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు అలాగే పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలకు పాల్గొనను న్నారని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు,డిప్యూటీ డీఈఓ అప్పారావు హాజరుకానున్నారని తెలియజేశారు. కార్యక్రమ ఏర్పాట్లను హూడాల మండల ఎమ్ఈఓ-1 మరియు ఎమ్ఈఓ-2 ఆధ్వర్యంలోను,డివిజనల్ కోఆర్డినేటర్ టి.వి.రమణ మరియు మండల కోఆర్డినేటర్ కె.రమేశ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## హిందూ స్మశాన వాటికల క్లీన్ అండ్ గ్రీన్ పనులకు శ్రీకారం



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మం డల కేంద్రంలో స్థానిక శాంతి నగరం సమీపంలో ఉన్న స్మశాన వాటికకు వెళ్ళే రహ దారిని సిసి రోడ్డు ఇటీవల వేయడం జరిగిందని రాజ వొమ్మంగి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు తెలిపారు. ఆ ప్రాంత వాసులకు సిసి రోడ్డు వేయడం వల్ల ఇబ్బందులు తొలగాయని చెప్పారు. అలాగే పాటి మీద కన్నయ్యమ్మ పేట సమీపంలో ఉన్న హిందూ స్మశాన వాటికను గురువారం రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన ఎపి ఐఐసి డైరెక్టర్, రాజవొమ్మంగి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు పర్యవేక్షణలో స్మశాన వాటికకు క్లీన్ అండ్ గ్రీన్ పనులను జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో గ్రావెల్ వేసి చదును చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు దృశ్యా గ్రావెల్ వేసి స్మశాన రహదారి చదును చేయడం జరుగుతుందని, అలాగే అక్కడ తుప్పలు, చెత్తాచెదారాలను తొలగించడం జరుగుతుందని, ఇక్కడ ఎవ్వరూ కూడా కోడి మాంసపు వ్యర్ధాలు, ఇతర ఎటువంటి చెత్తాచెదారాలు వేయవద్దని హెచ్చరించారు. ఈ స్మశాన వాటికకు షెడ్, బోరుతో పాటు తదితర అవసరమైన పనులు చేయడం జరుగుతుందని చెప్పారు. స్మశాన వాటికను పరిరక్షణ, పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ ప్రాంతాన్ని మొక్కలతో పచ్చదనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో దంతులూరి ప్రశాంత్ వర్మ, పెదిరెడ్ల సత్యనారాయణ, మరిచర్ల గోపి, తదితరులు ఉన్నారు

## డప్పు, తీన్మార్, కళాకారుల శిక్షణ కార్యక్రమం



**గాజువాక, పతాకం న్యూస్:** డప్పు, తీన్మార్ కళాకారుల శిక్షణ కార్యక్ర మం జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూని యన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్ష కార్య దర్శులు , టి. నూక రాజు, ఉరుకూటి రాజు, పి. వెంకట రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 31 నుండి 2026 జనవరి 4 వరకు జరుగు అఖిల భారత మహాసభల ముగింపు సభలో ర్యాలీ ప్రదర్శనలో భాగంగా ఈ కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణీయంగా కనిపిస్తోందన్నారు. ఈ నైపుణ్య ఉన్న కార్మికును ప్రోత్సహించడం సిఐటియు పోరాటాలకు కార్మిక చైతన్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆట,పాటతో ఉద్యమాలు మరింత ఉత్సాహము, బలం చేకూరుతుందన్నారు. కళాకారుల శిక్షణ గురువు బాలు, నూతన కళాకారులను ప్రోత్సహించారు. గొలగాని అప్పారావు, నక్క నాగరాజు, చిన్నారావు, గణేష్, రాజు, సూరిబాబు, హేమలత, రత్నం, శ్రావణ్ కుమార్, నాని, తదితరులు పాల్గొన్నారు.

## పాలసింగిలో మరో నాలుగు కిడ్నీ కేసులు



**సంతబొమ్మాళి, పతాకం న్యూస్:** కొన్నేళ్ల కిందట ప్రశాంతంగా ఉన్న ఆ గ్రామంలో అలజడి రేగుతోంది. నాలుగేళ్ల కిందట కిడ్నీ మహమ్మారి కేసు బయటపడింది. క్రమేపీ కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో తమ గ్రామానికి ఏమైందంటూ.. గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కిడ్నీవ్యాప్తి గల కారణాలపై యంత్రాంగం అన్వేషిస్తోంది. వివరాల్లోకి వెళితే.. టెక్కలి మండలం ముఖలింగపురం పంచాయతీ పాలసింగి గిరిజన గ్రామాన్ని కిడ్నీ వ్యాధి వేధిస్తోంది. ఇప్పటికే ఈ మహమ్మారి కారణంగా ఇద్దరు మృతి చెందగా.. మరో ఏడుగురు చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల నుంచి వైద్యశిబిరం నిర్వహించి రక్తనమూనాలు సేకరించారు. వైద్యాధికారిని భాగ్యశ్రీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 25 మందికి రక్తనమూనాలు సేకరించగా.. అందులో నలుగురికి కిడ్నీవ్యాధి ప్రాథమిక దశలో ఉన్నట్టు తేలింది. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. బావిలో తాగునీరే కిడ్నీవ్యాధి వ్యాప్తికి కారణమని గ్రామస్థులు ఆరోపించగా.. ప్రత్యేక వైద్యబృందాలు వచ్చి బావిలో తాగునీటిని పరిశీలించాయి. తాగునీటితో ఎటువంటి సమస్య లేదని చెప్పాయి. అధికంగా నొప్పిమాత్రలు వినియోగించడం వల్ల కిడ్నీవ్యాధి తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నాయి. కానీ బాధితులు మాత్రం తాము మందులు ఎప్పుడూ ఎక్కువగా వాడలేదని చెబుతున్నారు. ఇందులో ఏది నిజమో తెలియక మిగిలిన గిరిజనులు సతమతమవుతున్నారు. చిన్నవయసు వారికి సైతం కిడ్నీవ్యాధి ప్రబలడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కిడ్నీ నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా గురువారం కూడా వైద్యాధికారి భాగ్యశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, ఏఎన్ఎం ఉమా, హెల్త్ అసిస్టెంట్ పాల్గొణ తదితరులు వైద్యశిబిరంలో సేవలు అందించారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



**అరసవల్లి, పతాకం న్యూస్:** మహిళలు పారిశ్రామికవేత్త లుగా ఎదగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహిళా పారిశ్రా మిక వేత్తల నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గంలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన జరగాలని, ఆ దిశగా సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమం లో ఐటీ ప్రాజెక్టు ఇన్‌చార్జి జి.అరుణ్ కుమార్, ప్రిన్సిపాల్ సూర్యచంద్ర రావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణారావు, బోనెల అప్పారావు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచి ఆదుకున్న పూర్వ విద్యార్థులు



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం జడ్పీహెచ్ హైస్కూల్ (ఏ.ఎల్.పురం) 1987-88 పదో తరగతి పూర్వ విద్యార్థులు మరోసారి తమ స్నేహబంధం,మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి,కాలు విరిగిన తమ తోటి స్నేహితుడు లోకవరపు వెంకటరమణ వైద్య ఖర్చుల భారం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న వారి బ్యాచ్ స్నేహితులు వెంటనే స్పందించారు.వెంటనే ఒకరికొకరు సంప్రదించుకున్న పూర్వ విద్యార్థులు,తమకు తోచినంత సహాయం అందిస్తూ మొత్తం రూ.30,500ను వెంకటరమణ వైద్యానికి అందజేశారు. ఈ సహాయం స్వీకరించిన వెంకటరమణ భావోద్వేగానికి గురై,క్లిష్ట సమయంలో తోడుగా నిలిచిన పాత స్నేహితుల ప్రేమ, ఆప్యాయత పట్ల కృతజ్ఞతలు తెలిపారు.స్నేహం అంటే కేవలం జ్ఞాపకాలు కాదని,కష్టాల్లో తోడుగా నిలబడడమే నిజమైన స్నేహమని ఈ సందర్భంగా తోటి విద్యార్థులు పేర్కొన్నారు. "వెంకటరమణ మా చిన్ననాటి మిత్రుడు. ఆపదలో ఆదుకోవడం మా బాధ్యతగా భావించాం. ఈ సహాయం ఆయన చికిత్సకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నామని వారు తెలిపారు. వెంకటరమణ మాట్లాడుతూ ఈ సహాయం కేవలం డబ్బు కాదని,కష్టకాలంలో స్నేహితులు ఇచ్చే మానసిక ధైర్యం,భరోసా యేనని,మేమంతా నీకోసం ఉన్నాం అనే మాట నా కోసం పెద్ద శక్తి అని భావోద్వేగంతో అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలపు జోగునాదం,గాడి శ్రీను,లాలం నానిబాబు (ఉప్పు నాని), సుర్ల హైమావతి,చిటికెల సురేష్,సాంబమూర్తి తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన కాంతరావు

**అడ్డతీగల,పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ బి. కాంతారావు ఆకస్మిక తనిఖీ చేయడం జరిగినది పిల్లలకు పెట్టే మెనూ కరెక్ట్ గా ఇస్తున్నారా లేదా అని స్కూలు పిల్లలను అడిగినారు అలాగే వంట వండేవారిని ఏ రకంగా మీరు మెనూ తయారు చేస్తున్నారు అని రోజువారి మెనూ ప్రకారం మేము పిల్లలకు వంట తయారు చేసి పెడుతున్నాం అని చెప్పి ఉన్నారు అలాగే స్టాక్ రిజిస్టర్ ప్రకారముగా స్టాక్ ఎంతుందని ప్రతి ఐటెం వెరిఫికేషన్ చేయడం జరిగింది .కరెక్ట్ గా రికార్డ్ మెయింటెనెన్స్ బాగా చేస్తున్నారని స్కూల్ హెడ్మాస్టర్ ని కూనిశెట్టి ఈశ్వరరావు నీ అభినందించారు.

# షుగర్ ఫ్యాక్టరీ చెరుకు క్రషింగ్ మొదలు పెట్టాలని రైతు సంఘాల డిమాండ్



**చోడవరం, పతాకం న్యూస్:** చోడవరం షుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతు సంఘాలు, అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో షుగర్ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. చోడవరంషుగర్ ఫ్యాక్టరీ లో చెరుకు క్రషింగ్ చేపట్టాలని. చెరుకుని పాలకొండ ఫ్యాక్టరీకి తరలించకుండా చోడవరం షుగర్ ఫ్యాక్టరీ లోనే క్రషింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని. రైతులకు కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు నియోజకవర్గాల రైతులు చెరుకు పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ మూతపడటం వల్ల వారి యొక్క జీవన పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు . ప్రజా సంఘ నాయకులు వరప్రసాద్ మాట్లాడుతూ చోడవరం మాడుగుల నియోజకవర్గాల్లో పారిశ్రామికంగా వెనకబడి ఉన్నది. చోడవరం షుగర్ ఫ్యాక్టరీ ఒకటి మాత్రమే ఉన్నది. దాన్ని కూడా స్థానికంగా ఉన్న అధికార పార్టీ శాసనసభ్యులు నిర్లక్ష్యం వలన మూతపడే పరిస్థితి ఏర్పడింది అన్నారు.ఏడువాక సత్య రావు మాట్లాడుతూ ఇప్పటికైనా చోడవరం మాడుగుల రెండు నియోజకవర్గాల ప్రజలు రైతులు కార్మిక సంఘాలు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా మనం మన ప్రాంతాల్లో ఉన్న షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నందున మనందరం ఒక తాటిపైకి వచ్చి మన షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలని అన్నారు. కార్మిక సంఘం నాయకులు శరడం రామ నాయుడు మాట్లాడుతూ రానున్న కాలంలో రెండు నియోజకవర్గాల ఇటువంటి ఫ్యాక్టరీ వచ్చే అవకాశం లేనందున. మనం మన ఫ్యాక్టరీని దక్కించుకోవాల్సిన అవసరం ఉన్నందున కావున ప్రజలు అందరూ ఏకమై మనం మన యొక్క షుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలని అన్నారు

## రీ సర్వేలో సమస్యలు
## పరిష్కారానికి చర్యలు




**వజ్రపుకొత్తూరు, పతాకం న్యూస్:** మెట్టూరు రెవెన్యూ పరిధిలోగల గునుపల్లిలో రీసర్వేలో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ పేర్కొన్నారు. గునుపల్లి సచివాలయంలో రీ సర్వేలోసమస్యలను అడిగితెలుసుకుని, అర్జీలను పరిశీలించారు. తనస్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, మిగిలిన వాటిపై జేసీతో మాట్లాతానని తెలి పారు. ఇటీవల గునుపల్లిలో ఎయిర్‌పోర్టు నిర్వాసితులతో సమావేశం నిర్వహించిన సమయంలో తమ భూముల్లో రీసర్వేపై అనేక సమస్యలు ఉన్నట్లు రైతులు తెలియ జేశారు. దీంతో గురువారం తహసీల్దార్ సీతారామ్మూర్తితో కలిసి రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సులో డీటీ శ్రావన్, ఆర్ఐ మనోహర్ పాల్గొన్నారు.

## వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి తగిన గుర్తింపు పొందాలని వైద్యులకు సూచించారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు కారణంగా పలు వ్యాధులు ఆశిస్తున్నాయన్నారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర బాధితులు ఉన్నట్లయితే రక్త పరీక్షలు నిర్వహించి తగిన సేవలందించాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోజువారీ ఎంతమందికి తనిఖీలు నిర్వహిస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్ పి.శ్రీనివాసరావును అడిగారు. ప్రతిరోజూ 200 మందికి పైగా పరీక్షలు నిర్వహిస్తున్నామని టెక్నీషియన్ చెప్పారు. అత్యవసర మందులు నిల్వలతో పాటు ఓపీ రికార్డులను జేసీ పరిశీలించారు. గతంలో కంటే ప్రస్తుతం ఓపీ సంఖ్య పెరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలనతో పాటు రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో వసతులను నిశితంగా పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కేంద్రం ఆవరణలో రోగులకు ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో జి.పైడితల్లి, డాక్టర్ ఎన్ఎంకే తిరుమలప్రసాద్, కంటి వైద్య నిపుణులు శ్రీనివాసరావు, సిబ్బంది జగదీశ్వరి, తదితరులు ఉన్నారు.

## రేజ్లింగ్‌లో సత్తా చాటిన ఏపిటీడబ్ల్యూఆర్ కళాశాల విద్యార్థి భూషణం



**కొయ్యూరు,పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం లోని ఏపిటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలురు)లో ఎంపిసి చదువుతున్న విద్యార్థి టీ.భూషణం రాష్ట్ర స్థాయి రేజ్లింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించి కళాశాలకు ఘనతను తీసుకొచ్చాడు.చిత్తూరు పట్టణం, టీటీడీ కళ్యాణమండపంలో డిసెంబర్ 2,3 తేదీల్లో జరిగిన అసోసియేషన్ సీనియర్ మీట్-అండర్ 23 రేజ్లింగ్ పోటీలులో కోచ్ నూకరాజు శిక్షణలో పోటీ పడి భూషణం ప్రతిభ చాటాడు.ఈ విజయాన్ని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.లక్ష్మణుడు,వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.అచ్చన్న,పీడీ ఉదయ్ మరియు సిబ్బంది భూషణంను అభినందించారు. స్థానికంగా విద్యార్థి సాధించిన ఈ విజయంతో కళాశాల వాతావరణంలో ఆనందం నెలకొంది.

## సంక్రాంతి తర్వాత మూలపేటను తరలిస్తాం



**సంతబొమ్మాళి, పతాకం న్యూస్:** పోర్టు పునరావాస గ్రామమైన మూలపేటను సంక్రాంత్రి తర్వాత నౌపడ పునరావస కాలనీకి తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. సంతబొమ్మాళి మండలం నౌపడలోని ఆర్అండ్ఆర్ కాలనీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు ప్రారంభించడానికి ఇంకెంత సమయం కావాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. వారం రోజుల్లో ఆర్అండ్ ఆర్ కాలనీలో అన్ని పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఇంటింటికి కుళాయి పాయింట్లు, తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణకు సూచించారు. మూలపేటలో 75మంది నిరుపేదలను గుర్తించామని వారందరికీ ఉచితంగా ఇంటి నిర్మాణ సామగ్రి అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలనీలో నాలుగు చెరువులను అభివృద్ధి చేస్తామని, కాలనీ వాసులకు నౌపడలో శశ్మానవాటిక పనులు త్వరలోనే చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్, ఎంపీడీవో పి.జయంత్ ప్రసాద్, మండల ఇంనీరింగ్ అధికారి అంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన ఫలితాలకు వంద రోజుల ప్రణాళిక



**పొందూరు, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు డీఈవో ఎ.రవిబాబు అన్నారు. తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30 గంటలకు విద్యార్థులకు నిర్వహిం చిన ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో భాగంగా అన్ని సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థు లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక అమలుచేయని పాఠశాలల్లో హెచ్ఎంతో పాటు సబ్జెక్టు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గణితంపై విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం పిల్లల వలస జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.

## అరకు సర్కిల్‌లో నూతన పోలీస్ కానిస్టేబుల్స్‌ను సన్మానించిన సీఐ, ఎస్సై



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకు సర్కిల్ పరిధిలోని గిరిజన యువత నుంచి నూతనంగా పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైన 24 మందిని అరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.హిమగిరి, సబ్-ఇన్‌స్పెక్టర్ జి.గోపాల్ రావు ఘనంగా సన్మానించారు. అరకు సర్కిల్ ఆఫీస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అరకు వ్యాలీ నుంచి 12 మంది, డుంబ్రిగూడ నుంచి 8 మంది, అనంతగిరి నుంచి 4 మంది మొత్తం 24 మంది నూతన కానిస్టేబుల్స్‌ను సీఐ, ఎస్సైలు దుస్సాలువతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా సీఐ హిమగిరి, ఎస్సై గోపాల్ రావు మాట్లాడుతూ - గిరిజన గ్రామాల యువతీయువకులు ఈ ఎంపికైనవారిని ఆదర్శంగా తీసుకుని చడు మార్గాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి మార్గంలో ముందుకు రావాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిపెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపికైన కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు, అరకు వ్యాలీ సిహెచ్ స్కూల్ హెడ్‌మాస్టర్ తాంగుల మోహన్ రావు, రామారావు హాజరయ్యారు.

## రూ.50 వేల కోట్ల బాండ్లు కొనుగోలు చేసిన ఆర్బీఐ




**ముంబై:** దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక చర్యలు చేపట్టింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యతను (లిక్విడిటీ) పెంచేందుకు, మార్కెట్ నుంచి రూ. 50,000 కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసింది. గత వారం ప్రకటించిన ద్రవ్యపరపతి విధానంలో భాగంగా, మొత్తం రూ. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఇందులో భాగంగా తొలి విడత కొనుగోలును డిసెంబర్ 11న పూర్తి చేసింది. రెండో విడతలో మరో రూ. 50,000 కోట్ల బాండ్లను డిసెంబర్ 18న కొనుగోలు చేయనుంది. దీనికి అదనంగా, డిసెంబర్ 16న ఫారెక్స్ స్వాప్ ద్వారా మరో 5 బిలియన్ డాలర్ల నగదును కూడా వ్యవస్థలోకి చొప్పించనుంది. ఇటీవల రూపాయి విలువ పతనం కాకుండా నిరోధించేందుకు ఆర్బీఐ పెద్ద ఎత్తున డాలర్లను విక్రయించింది. ఈ ప్రక్రియ వల్ల బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి భారీగా నగదు బయటకు వెళ్లిపోయింది. ఈ పరిణామం వడ్డీ రేట్లపై ఒత్తిడి పెంచుతుండటంతో, దాన్ని సరిదిద్దేందుకు ఆర్బీఐ ఈ తాజా చర్యలు చేపట్టింది. గత శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, "బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సరిపడా ఉండేలా చూస్తాం. మానిటరీ ట్రాన్స్‌మిషన్ సక్రమంగా జరుగుతోంది, దానికి పూర్తి మద్దతు ఇస్తాం" అని స్పష్టం చేశారు. బ్యాంకులు సజావుగా పనిచేయడానికి అవసరమైన నిధులు అందుబాటులో ఉంచడమే తమ ప్రాధాన్యత అని ఆయన వివరించారు.

## వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : డీజీపీ హరీష్ కుమార్ గుప్తా




**తాడేపల్లి, పతాకం న్యూస్:** మహిళలు, బాలికల పట్ల వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. తాడేపల్లిలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు శక్తి టీమ్స్ నిరంతరం పహారా కాస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిలు రవిశంకర్ అయ్యన్నార్, ఆర్కే మీనా, ఉజాలా త్రిపాఠి, ఆదనపు డిజి మధుసూదన్ రెడ్డి, ఉమెట్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఇన్‌చార్జి బి.రాజకుమారి ఇతర పోలీసు అధికారులు పాల్గన్నారు.

## 2027 జనాభా లెక్కలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్... అదే సమయంలో కులగణన కూడా!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా నిర్వహించే అతిపెద్ద పరిపాలనాపరమైన ప్రక్రియ, జనాభా లెక్కలు-2027కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో చేపట్టనున్న ఈ బృహత్ కార్యక్రమానికి రూ.11,718.24 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఆమోదముద్ర వేశారు. ఈ జనగణనలో జనాభాతో పాటు కులాల వారీగా వివరాలను కూడా సేకరించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భారీ ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో 'ఇళ్ల జాబితా, గృహ గణన' చేపడతారు. ఇక రెండో దశలో అసలైన 'జనాభా లెక్కింపు' కార్యక్రమాన్ని 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. అయితే, లడఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచుతో కప్పబడిన ప్రాంతాల్లో మాత్రం జనాభా లెక్కింపును 2026 సెప్టెంబర్‌లోనే పూర్తి చేస్తారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 30 లక్షల మంది ఫీల్డ్ సిబ్బంది పాల్గొననున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఇది 8వ జనాభా గణన కాగా, మొత్తంగా 16వది. ఈసారి దీనిని పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నారు. డేటా సేకరణ కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్‌ను (ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లలో) వినియోగిస్తారు. మొత్తం ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 'సెన్సస్ మేనేజ్‌మెంట్ & మానిటరింగ్ సిస్టమ్ పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేశారు. దీని ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనిని రియల్ టైంలో సమీక్షించే వీలుంటుంది. ఈసారి ప్రజలకు 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' పేరుతో స్వయంగా తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో పాటు, అత్యంత ముఖ్యమైన అంశం కులగణన. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ 2025 ఏప్రిల్ 30న తీసుకున్న నిర్ణయం మేరకు, ఈ జనాభా గణనలో కులాల వారీగా వివరాలను కూడా ఎలక్ట్రానిక్ పద్ధతిలో సేకరిస్తారు.

# పైడిభీమవరం ఈఎస్ఐ డిస్పెన్సరీలో అందని సేవలు




**రణస్థలం, పతాకం న్యూస్:** పైడిభీమవరంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ(కార్మిక బీమా వైద్యశాల)లో కార్మికులకు కనీస వైద్యం కరువవుతోంది. వివిధ పరిశ్రమల్లో ప్రతి కార్మికుడి జీతాల నుంచి ఈఎస్ఐ వైద్యం కోసం కొంత మొత్తం కోత విధిస్తున్నారు. కానీ అత్యవసర, అనారోగ్య సమయంలో కార్మికులకు వైద్యం ఇక్కడ అందని ద్రాక్షగా మారింది. దీంతో వేలాది మంది కార్మికులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో అతిపెద్ద పారిశ్రామికవాడగా పైడిభీమవరం పేరొందింది. ఆపై పలాస-కాశీబుగ్గలో జీడి పరిశ్రమలు వందలాది ఉన్నాయి. టెక్కలి, ఎచ్చెర్ల ప్రాంతంలో గ్రానైట్, చిప్స్ క్వారీలు ఉన్నాయి. వందలాది ధాన్యం మిల్లులు ఉన్నాయి. వీటి పరిధిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. జిల్లాలో కార్మికుల వైద్యం కోసం 2010లో పైడిభీమవరంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. ఈ డిస్పెన్సరీ పరిధిలో 23 వేలమంది కార్మికులు ఉన్నారు. అన్ని విభాగాలకు సంబంధించి వైద్యులు, అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్, మత్తు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆపై ఫార్మాసిస్ట్, స్టాప్‌నర్సులు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలి. కానీ డాక్టర్ ఒక్కరే ఉన్నారు. ఆయన కూడా ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై కాకినాడలో విధులు నిర్వహించి ఈనెల 8న ఇక్కడ వైద్యుడిగా బాధ్యతలు చేపట్టారు. మరో డాక్టర్ గరివిడి డిస్పెన్సరీ నుంచి డిప్యూటేషన్‌పై ఇక్కడకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు. కానీ వైద్య పరీక్షలకు అవసరమైన కిట్లు లేవు. అత్యవసర వైద్యం అందించే విభాగం లేదు. రోగులను తరలించేందుకు అంబులెన్స్ కూడా లేదు. ఈఎస్ఐ డిస్పెన్సరీకి సంబంధించి రూ.6కోట్లతో అత్యాధునిక భవనాలు నిర్మించారు. కానీ కనీసస్థాయిలో కూడా వైద్యసేవలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర కార్మికశాఖ కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పలాస-కాశీబుగ్గలో జీడి కార్మికులు సైతం అత్యవసర సమయాల్లో వైద్యసేవలు పొందలేకపోతున్నారు. జీడి పరిశ్రమల్లో దాదాపు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో ఈఎస్ఐ పరిధిలో పాలీక్లినిక్ ఏర్పాటు చేశారు. ఏదైనా ప్రమాదం జరిగినా.. అనారోగ్యానికి గురైనా వెంటనే పాలీ క్లినిక్‌లో ప్రాథమిక వైద్యం అందించేవారు. తరువాత రణస్థలం, విశాఖ తరలించేవారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో ఈఎస్ఐ నమోదు ప్రక్రియను చేపట్టారు. కానీ యాజమాన్యాలు అప్పట్లో కార్మికుల సంఖ్యను తక్కువ చేసి చూపించడంతో ఉన్న పాలీక్లినిక్‌ను సైతం ఎత్తేశారు. అప్పటి నుంచి జీడి కార్మికులకు వైద్యసేవలందడం లేదు.

కార్మికుడితోపాటు ఉద్యోగి హక్కు ఈఎస్ఐ. ఇది సామాజిక భద్రత పథకం. అనారోగ్యం, వైకల్యం, ప్రసూతి, పనిచేసే సమయంలో ప్రమాదాలు కారణంగా ఏర్పడే గాయాలు, మరణం వంటివాటి నుంచి ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యం అందిస్తుంది ఈ పథకం. పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తూ రూ.21వేలు కంటే తక్కువ జీతం ఉన్నవారు ఈఎస్ఐకి అర్హులు. ఈఎస్ఐ పథకం అమలు చేయడం యజమాని ముఖ్య బాధ్యత. ఉద్యోగి వేతనంలో యజమాని 3.25శాతం, ఉద్యోగి 0.75 శాతం భరించాల్సి ఉంటుంది. ఇలా కార్మిక శాఖకు జిల్లాలో కార్మికవర్గాల నుంచి ఏటా లక్షలాది రూపాయలు జమవుతోంది. అయితే చాలామంది యజమానులు తమ వద్ద పనిచేసేవారికి ఈ సదుపాయం కల్పించడం లేదు. ఈఎస్ఐ ఉన్నవారికి పైడిభీమవరం డిస్పెన్సరీలో వైద్యసదుపాయాలు దక్కడం లేదు. అన్నివిధాలా కార్మికులు దగాకు గురవుతున్నారు. దీనిపై ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరముంది. తమకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు.

# ఏపీఎస్‌పీడీసీఎల్‌లో 25 మంది ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు

**తిరుపతి, పతాకం న్యూస్:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో 25 మంది అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు-5, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/ అసిస్టెంట్ ఇంజనీర్-13, జూనియర్ ఇంజనీర్-1, లైన్ ఇన్‌స్పెక్టర్ -1, లైన్‌మెన్-1, అసిస్టెంట్ లైన్‌మెన్- 2. ఎనర్జీ అసిస్టెంట్-1లపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. తిరుపతి సర్కిల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ పి.ఉత్తన్నకు 2 ఇంక్రిమెంట్లను (క్యుములేటివ్) నిలుపుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. తిరుపతి సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.వసంతయ్యకు 2 ఇంక్రిమెంట్లను (క్యుములేటివ్) నిలుపుదల, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు/అసిస్టెంట్ ఇంజనీర్లు వివిస్ గిరి, ఎస్.మెహబూబ్ బాషా, లైన్ ఇన్‌స్పెక్టర్ టి.డి.లక్ష్మీపతి, లైన్‌మెన్ ఎన్.రాధా కృష్ణ, అసిస్టెంట్ లైన్‌మెన్ బి.దామోదరం, ఎనర్జీ అసిస్టెంట్ కె.లోకేష్‌లకు ఒక్కో ఇంక్రిమెంటును (క్యుములేటివ్) నిలుపుదల చేశారు. తిరుపతి సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సి.రవిచంద్రబాబు, ఎం.మోహన్ రావు, బి.వెంకటరమణ, వై.బాలగున్న య్యలకు, కర్నూలు సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లు వై.గర్జప్ప, ఎన్.మద్దిలేటిలకు ఒక ఇంక్రిమెంటును (విత్‌ఔట్ క్యుములేటివ్) ఎందుకు నిలుపుదల చేయకూడదో తెలపాలంటూ షోకాజ్ నోటీసును జారీ చేశారు. తిరుపతి సర్కిల్‌లోని అసిస్టెంట్ ఇంజనీర్ ఎంఎస్.ప్రసాద్, అసిస్టెంట్ లైన్‌మెన్ జి.సాంబశివలకు, కర్నూలు సర్కిల్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.ఖాజావలికి షోకాజ్ నోటీసును జారీ చేశారు. నెల్లూరు సర్కిల్‌లో ఎసిబికి పట్టుబడిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శివశంకరయ్యకు, కర్నూలు సర్కిల్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.విశ్వశాంతి స్వరూప్, నెల్లూరు సర్కిల్‌లోని డిస్ట్రిక్ట్ స్టోర్స్, గూడూరులో డిప్యూటీ ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ పి.శంకరయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ బి.మల్లికార్జునలకు, తిరుపతి సర్కిల్లో అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.చలపతికి ఆర్టికల్స్ ఆఫ్ చార్జ్‌ను జారీ చేశారు. నెల్లూరు సర్కిల్‌లో జూనియర్ ఇంజనీర్ వి.వెంకటేశ్వర్లుపై విచారణ అధికారిని నియమించారు. కడప సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.రాజశేఖర్ రెడ్డి కోర్టు కేసుకు సంబంధించిన అప్పీల్‌ను సకాలంలో ఫైల్ చేయకపోవడంతో వివరణను సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. నెల్లూరు సర్కిల్‌లో ట్రైనింగ్ సెంటర్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.హంజా నవాజ్ ఖాన్‌పై నివేదికను సమర్పించాల్సిందిగా నెల్లూరు సూపరింటెం డింగ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. దీంతో పాటు క్రమశిక్షణా చర్యలపై మరో ముగ్గురు ఉద్యోగుల




అప్పీళ్ళను తిరస్కరించారు.మినహా వాస్తవంగా అణచివేయలేదని పేర్కొన్నారు. ఉగ్రదాడులు జరుగుతాయనే సమాచారంతో తనిఖీలు చేస్తున్న కేంద్రం ముందుగానే వాటిని ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ఇలాంటి సమయాల్లో మతాన్ని టార్గెట్ చేసుకుని ప్రచారం చేయడం వల్ల వైషమ్యాలు పెరుగుతున్నాయి మినహా ఉగ్రవాదం తగ్గదని చెప్పారు.. ఇప్పటికైనా కేంద్రం స్పందించి అఖిలపక్షం ఏర్పాటు చేసి ఉగ్రవాద నివారణకు అవసరమైన సలహాలు సూచనలు తీసుకుని వాటిని అమలు చేయాలని కోరారు.మొంథా తుఫానులో నష్టపోయిన రైతులకు పరిహారం ఎగ్గొట్టేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి అన్నారు. పెద్దఎత్తున నష్టం వాటిల్లిందని తొలుత చెప్పిన ప్రభుత్వం ఎన్యుమరేషన్లో తగ్గించుకుంటూ వస్తోందని అన్నారు. వరి, అరటి, మొక్కజన్న, పసుపు వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో రైతుల సంఖ్యను తగ్గిస్తున్నారని తెలిపారు. గతంలో ఉచిత పంటల బీమా వల్ల రైతులకు ఉపయోగం కలిగందని, ప్రస్తుతం అది లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే సిసిఏ అనుసరిస్తున్న విధానం వల్ల పత్తిరైతులకు అన్యాయం జరుగుతోందని, నిబంధనలు మార్చాలని డిమాండు చేశారు. మొక్కజన్న రైతులను ఆదుకోవాలని కోరారు. పంటలు దెబ్బతిన్న రైతులు, కౌలు రైతులు అందరినీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఇరుకు గదుల్లో సచివాలయ సేవలు

**అనంతపురం, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో నూతనంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన విషయం విది తమే. అయితే చాలా చోట్ల ప్రభుత్వ భవనాలను పూర్తిచేయడంలో మరి చింది. మండల వ్యాప్తంగా సచివాల యాలు పలు సచివాలయాలు నిర్మా ణ దశలోనే ఉన్నాయి. దీంతో వాటిని ఇరుకైన అద్దెగదుల్లో నిర్వహిస్తుం డడంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అమడగూరు, కసముద్రం, మహమ్మదాబాద్‌లలో గ్రామ సచివాలయాలకు మంజూరైన భవనాలను పూర్తిగా నిర్మించారు. అవి ప్రారంభమై వాటిలో ఉద్యోగులు సేవలందిస్తున్నారు. అయితే పూలకుంటపల్లి, చినగానిపల్లి, తుమ్మల, చీకిరేవులపల్లి, జౌకలకొత్తపల్లిలో కొన్ని మోల్డింగ్ వరకు నిర్మించగా, కొన్ని గోడలతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయాలను పంచాయతీ కార్యాలయాల్లోని చిన్నగదు ల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా గుండువారిపల్లిలో భవనం పూర్తి అయి ఏడాది గడుస్తు న్నా ప్రారంభానికి నోచుకోలేదు.

జౌకలకొత్తపల్లిలో పాత పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అక్కడ నెట్‌వర్క్ సమస్య ఉండడంతో సచివాలయ సిబ్బంది పక్కనే ఉన్న



హాస్టల్ గదులలో ప్రజలకు అరకొరగా సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు కసముద్రంలోనూ నెట్‌వర్క్ సమస్య నెలకొంది. అయితే అ?ధికారు లు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అన్ని గ్రామ సచివాల యాలలో గతంలో ఫైబర్ నెట్ సౌకర్యం ఉండేది. దాన్ని తొలగించడంతో సిబ్బంది వారి సెల్‌ఫోనలో ఉన్న ఇంటర్‌నెట్ సాయంతో ప్రజలకు సేవ లు అందిస్తున్నారు. దీంతో సేవలకు అంతరాయాలు కలుగు తున్నాయ ని దీనిపై అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే – మెనోపాజ్ దశ మొదలైనట్లేనట!

## ఈ దశలో పలు శారీరక, మానసిక సమస్యలు.. అశ్రద్ధ చేయొద్దంటున్న నిపుణులు

రాత్రిళ్లు ఉన్నట్టుండి నిద్రలోనే చెమటలు పడతాయి. మానసికంగా గందరగోళం అనిపిస్తుంది. ఈ సమయంలో ఎవరైనా పలకరించినా చిరాకొస్తుంది! మెనోపాజ్‌కు చేరువవుతోన్న మహిళల్లో ఇలా చాలానే సమస్యలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, వీటి గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల జనాలు ఆందోళన చెందుతుంటారు. ఈ క్రమంలో మెనోపాజ్ కు చేరువవుతున్న వాళ్లలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! మెనోపాజ్ సమయంలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. వాటి ద్వారా మెనోపాజ్ దశకు చేరుకున్నావని గుర్తించొచ్చని అంటున్నారు. వీటిల్లో కొన్ని లక్షణాలు ఒక్కసారిగా దాడి చేస్తే.. మరికొన్ని ఆలస్యంగా మొదలవుతాయని పేర్కొంటున్నారు. ఉన్నట్టుండి మొదలయ్యే లక్షణాల్లో.. శరీరమంతా లేదా కొన్ని భాగాల్లో (తల, మెడ, ఛాతీ దగ్గర) చర్మం అంతా కందిపోయినట్టు ఎర్రగా తయారవుతుందట. ఈ భాగాల్లో చాలా వేడిగా కూడా ఉండటంతోపాటు చెమటలు కారిపోతూ ఉంటాయని చెబుతున్నారు. వీటిని 'హాట్ ఫ్లషెస్' అంటారు. రాత్రిళు చెమటలు పట్టడం, నిద్ర పట్టకపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది. ఇలా ఎక్కువసార్లు జరగడం వల్ల దాని ప్రభావం రోజువారీ అలవాట్లపై పడుతుందంటున్నారు నిపుణులు. దీంతో చిరాకు, కోపం, అసహనం లాంటివి పెరిగిపోతూ ఉంటాయని వివరిస్తున్నారు. ఇలాంటి లక్షణాలు ఎక్కువగా ఉన్నప్పుడు డాక్టర్లు ఈస్ట్రోజెన్ హార్మోన్?ని సూచిస్తారు. అయితే, కొన్ని సంవత్సరాల ముందు నుంచే ప్రాణాయామం, ధ్యానం, యోగా లాంటివి చేసే వారిలో ఈ




లక్షణాలు తక్కువగా కనిపిస్తాయని వెల్లడిస్తున్నారు. మెనోపాజ్‌ని సూచించే మరో లక్షణం నెలసరిలో తేడా కనిపిస్తుందని అధ్యయనం పేర్కొంది. ఈ దశకు ఏడాది, రెండేళ్ల ముందు నుంచి నెలసరి క్రమం తప్పుతుందంటున్నారు నిపుణులు. కొన్నిసార్లు త్వరగా వచ్చేస్తే, మరి కొన్నిసార్లు ఆలస్యంగా రెండు, మూడు నెలలకు ఒకసారి వస్తూ ఉంటుందని చెబుతున్నారు. రక్తస్రావం మరీ ఎక్కువగా లేదా మరీ తక్కువగా ఒక పద్ధతంటూ లేకుండా వచ్చి ఇబ్బంది పెడుతుందని తెలియజేస్తున్నారు. ఒకటి, రెండు నెలలు నెలసరి రాకపోయేసరికి ఒక్కోసారి గర్భం దాల్చామా? అనుకొని చాలామంది భయపడుతూ ఉంటారని పేర్కొంటున్నారు. అలాంటి తేడాలుంటే వెంటనే డాక్టర్?ని సంప్రదించడం మంచిదంటున్నారు.

మూత్రనాళ ఇన్ఫెక్షన్లు : మెనోపాజ్ ప్రభావం మూత్రవ్యవస్థ, జననేంద్రియాల పైన కూడా పడుతుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే, మెనోపాజ్ ముందు వరకు యోని, మూత్ర నాళం, మూత్రకోశాల్లో రిసెప్టర్లు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. ఎప్పుడైతే, ఈస్ట్రోజెన్ తగ్గుతుందో అప్పుడు ఆ కణజాలం బలహీనమై, పొడిబారిపోతుందని పేర్కొంటున్నారు. అదే అసౌకర్యానికి, మంటకు దారితీస్తుందని తెలియజేస్తున్నారు. ఇక మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కలయిక సమయంలో నొప్పి వంటివి సాధారణంగా వచ్చే సమస్యలే.. డాక్టర్ల సలహాతో వీటిని తగ్గించుకోవచ్చని పేర్కొంటున్నారు.

అండాశయాల నుంచి హార్మోన్ల విడుదల ఆగిపోవడం, ముఖ్యంగా ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గడం వల్ల కొన్ని సమస్యలు కనిపిస్తూ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గడం వల్ల.. ఎముక సాంద్రత కోల్పోయేలా చేస్తుందని అధ్యయనం పేర్కొంది. ఎముక లోపల క్యాల్షియం, విటమిన్ డి నిల్వలు తగ్గి అవి బలహీనంగా మారతాయంటున్నారు నిపుణులు. దీంతో ఎముకలు క్రమంగా గుల్లబారి మెత్తగా తయారవుతాయని చెబుతున్నారు. కొన్నిసార్లు ఒళ్లంతా నొప్పులుగా అనిపించడం, చిన్న దెబ్బ తగిలినా ఫ్రాక్చర్లు కావడం లాంటివి ఆస్టియోపొరోసిస్?ను సూచిస్తాయని పేర్కొంటున్నారు. ఎముకల సాంద్రత తగ్గకుండా ఈస్ట్రోజెన్?తో పాటు క్యాల్షియం, విటమిన్ డి తీసుకోవాలని తెలియజేస్తున్నారు. ఒకవేళ ఎముకల బలం విపరీతంగా తగ్గితే వాటిని పెంచేందుకు డాక్టర్లు మందులు సూచిస్తారని పేర్కొంటున్నారు.

మెనోపాజ్ ప్రభావం మానసిక ఆరోగ్యంపై కూడా పడుతుందట. మగవారితో పోలిస్తే ఆడవారిలో అల్జీమర్స్? సమస్య ఎక్కువని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈస్ట్రోజెన్‌కి నాడీ వ్యవస్థను కాపాడే లక్షణం ఉంటుందని చెబుతున్నారు. ఎప్పుడైతే ఆ హార్మోన్ స్థాయి తగ్గుతుందో అల్జీమర్స్ మొదలవుతుందని తెలియజేస్తున్నారు. అలాగే కండరాలు కూడా బలహీనమైపోతాయని పేర్కొంటున్నారు. మెనోపాజ్ చేరువవుతోన్న వాళ్లలో జ్ఞాపకశక్తి లేదా ఏకాగ్రతతో సమస్యలు వస్తాయని అధ్యయనం పేర్కొంది. మెనోపాజ్ వచ్చే వరకు మహిళలలో గుండెపోటు చాలా అరుదుగా కనిపిస్తుందంటున్నారు నిపుణులు. కానీ, 50 ఏళ్లు దాటిన తర్వాత పురుషులతో సమానంగా మహిళలు కూడా గుండెపోటు ప్రమాదాన్ని ఎదుర్కొంటారని చెబుతున్నారు. ఎందుకంటే, అప్పటి వరకు ఈస్ట్రోజెన్ గుండెను, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుందని వివరిస్తున్నారు.

# ముల్తానీ మట్టి ఫేస్ ప్యాక్‌ని రోజూ వేసుకోవచ్చా..



ఇక్కడ ముల్తానీ మట్టితో హోమ్ రెమెడీస్ ను వివరించాము. వీటిని, స్కిన్ కేర్ రొటీన్ లో భాగంగా చేసుకుంటే మీ స్కిన్ మెరిసిపోతుంది. స్కిన్ టైప్ ఏదైనా సరే ఈ ప్యాక్స్ అద్భుతంగా హెల్ప్ చేస్తాయి. మంచి రిజల్ట్స్ ను ఇస్తాయి. మరి, ఈ ప్యాక్స్ విశేషాలు అవేంటో తెలుసుకుం దామా..? స్కిన్ కేర్ విషయంలో ముల్తానీ మట్టికున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అన్నిరకాల స్కిన్ ట్రబుల్స్ కు ముల్తానీ మట్టితో పరిష్కారం లభిస్తుంది. ముల్తానీ మట్టికున్న గొప్పతనం ఏంటంటే స్కిన్ ప్రాబ్లెమ్ ను తగినట్టుగా దీనిలో ఇంగ్రిడియెంట్స్ ను కలిపి కస్టమైజ్డ్ ఫేస్ ప్యాక్స్ ను తయారుచేసుకుని దీని బెనిఫిట్స్ ను పొందవచ్చు. వర్షాకాలంలో స్కిన్ కు అదనపు సంరక్షణ అవసరం. అలాగే స్కిన్ ను ప్యాంపర్ చేయాల్సిన అవసరం కూడా ఎక్కువే. సమ్మర్ అలాగే వింటర్ సీజన్ల కంటే స్కిన్ కు ఎడిషనల్ కేర్ అనేది వర్షాకాలంలో మరింత ముఖ్యం. వాతావరణంలో తేమ అనేది స్కిన్ ను మరింత కన్ఫ్యూజన్ కు గురిచేస్తుంది. కాబట్టి, స్కిన్ అనేది వివిధ రకాలుగా రియాక్ట్ అవుతుంది. దాంతో, యాక్నే, బ్రేకవుట్, డ్రై పాచెస్, పింపుల్స్ వంటి సమస్యలు మొదలవుతాయి. అందుకే, స్కిన్ కండిషన్ ను తెలుసుకుని తగిన కేర్ తీసుకోవాలి. స్కిన్ కేర్ విషయంలో ముల్తానీ మట్టికున్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. అన్నిరకాల స్కిన్ ట్రబుల్స్ కు ముల్తానీ మట్టితో పరిష్కారం లభిస్తుంది. ముల్తానీ మట్టికున్న గొప్పతనం ఏంటంటే స్కిన్ ప్రాబ్లెమ్ ను తగినట్టుగా దీనిలో ఇంగ్రిడియెంట్స్ ను కలిపి కస్టమైజ్డ్ ఫేస్ ప్యాక్స్ ను తయారుచేసుకుని దీని బెనిఫిట్స్ ను పొందవచ్చు. ముల్తానీ మట్టిలో ఐరన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ సర్క్యులేషన్ ను ఇంప్రూవ్ చేస్తుంది. కొత్త సెల్స్ గ్రోత్ ను పెంపొందిస్తుంది. దాంతో స్కిన్ ప్రకాశవంతంగా ఉంటుంది. ముల్తానీమట్టితో స్క్రబ్బింగ్ చేస్తే డెడ్ సెల్స్ సమస్య తొలగిపోతుంది. స్కిన్ కు వైబ్రెంట్ లుక్ లభిస్తుంది.

డార్క్ సర్కిల్స్ ను తగ్గించేందుకు కూడా ముల్తానీ మట్టి హెల్ప్ చేస్తుంది. ఇందులో నిమ్మరసం అలాగే పెరుగును కలిపి పేస్ట్ లా అప్లై చేసి డార్క్ సర్కిల్స్ పై అప్లై చేస్తే మంచి రిజల్ట్స్ వస్తాయి. ఇరవైనిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తరువాత వాష్ చేయాలి. ముల్తానీమట్టిని ముఖంపై రోజూ వాడకూడదు. అతిగా వాడితే, ఇది స్కిన్ లోని నేచురల్ మాయిశ్చరైజర్ ను కోల్పోయేలా చేస్తుంది. స్కిన్ పొడిబారుతుంది. వారంలో రెండు సార్లు వాడవచ్చు. దీని షెల్ఫ్ లైఫ్ ఎక్కువే. ఐతే, ఎయిర్ టైట్ కంటైనర్ లో స్టోర్ చేస్తే హెల్ప్ ఫుల్ గా ఉంటుంది. దీన్ని ఫ్రిడ్జ్ లో పెడితే మరీ మంచిది. అయినా, 100 పెర్సెంట్ స్వచ్ఛమైన ముల్తానీమట్టినే కొనేందుకు ప్రాధాన్యత నివ్వండి. అప్పుడే, ఎక్కువ షెల్ఫ్ లైఫ్ ను ఎక్స్పెక్ట్ చేయగలం. ముల్తానీ మట్టిని శాండల్వుడ్ పౌడర్ లో కలిపి వాడితే ప్రీమెచ్యూర్ ఏజింగ్ సమస్య తగ్గుతుంది. కాస్తంత రోజ్ వాటర్ ను కలిపి పేస్ట్ లా తయారుచేసి ఫేస్ ప్యాక్‌లా వాడాలి. డ్రై స్కిన్ ఉన్నట్టయితే కాస్తంత ముల్తానీ మట్టిని తీసుకుని అందులో కొంత అలోవెరా జెల్ ను అలాగే తేనెను కలపండి. రెండు టీస్పూన్స్ ముల్తానీ మట్టిలో ఒక టీస్పూన్ తేనె అలాగే ఒక టీస్పూన్ అలోవెరా జెల్ ను కలపాలి. ఈ పదార్థాలని బాగా కలిపి స్మూత్ పేస్ట్ ను తయారుచేసుకోవాలి. ఇప్పుడు, ఈ పేస్ట్ ను ముఖానికి అలాగే మెడకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాలపాటు అలాగే వదిలేయాలి. దానంతట అది ఆరిపోయాక ఫేస్ ను నీళ్లతో కడగాలి. మాయిశ్చరైజర్ ను జెంటిల్ గా అప్లై చేయాలి. ఇలా వారానికి ఒక్కసారి ముల్తానీ మట్టి ఫేస్ ప్యాక్ ను డ్రై స్కిన్ ను సాఫ్ట్ గా సపిల్ గా చేయాలంటే ముల్తానీ మట్టిలో ఇంకొన్ని ఇంగ్రిడియెంట్స్ ను కూడా కలపాలి. ముల్తానీమట్టి ఫేస్ ప్యాక్ అనేది డ్రై మరియు డల్ స్కిన్ లో రేడియేన్స్ ను జోడించాలంటే ఈ ఇంగ్రిడియెంట్స్ ను కలపాలి. ఒక స్పూన్ బాదాం పొపు పొడి అలాగే అరకప్పుమిల్క్ ను ముల్తానీమట్టిలో కలిపి మిశ్రమాన్ని రెడీ చేసుకోవాలి. ముఖానికి అప్లై చేసి ముప్పై నిమిషాలపాటు అలాగే వదిలేయాలి. ఆ తరువాత వాష్ చేయాలి. సెబమ్ ఎక్కువగా ప్రొడ్యూస్ ఐతే స్కిన్ ఆయిలీగా మారుతుంది. స్కిన్ ను పర్యావరణ కాలుష్యకారకాల నుంచి రక్షించాలంటే సెబమ్ అనేది ముఖ్యం. ఐతే, ఇది అత్యధికంగా ప్రొడ్యూస్ అయినప్పుడు మాత్రం అనేక స్కిన్ ఇష్యూస్ వస్తాయి. ఆయిలీ స్కిన్ ఐతే స్కిన్ పై డర్ట్ ఎక్కువగా పేరుకుంటుంది. రాను రాను స్కిన్ డల్ గా మారిపోతుంది. దీనివల్ల యాక్నే, పింపుల్స్ అలాగే స్కిన్ ఇన్ఫెక్షన్స్ వస్తాయి. అదనపు సెబమ్ చుట్టుపక్కలున్న ఇంప్యూరిటీస్ ను అట్రాక్ట్ చేసి స్కిన్ పోర్స్ ను బ్లాక్ చేస్తుంది. ఆయిలీ స్కిన్ ఉన్నవారికి ముల్తానీ మట్టి ఎన్నో విధాలుగా హెల్ప్ అవుతుంది. కేవలం ఒకే ఒక్కసారి అప్లై చేసినప్పటి నుంచే స్కిన్ లోని సెబమ్ ప్రొడక్షన్ కంట్రోల్ అవడాన్ని గుర్తించగలుగుతారు. ఇది స్కిన్ పోర్స్ క్లాగ్ అవకుండా సంరక్షిస్తుంది. స్కిన్ స్మూత్ గా అలాగే సాఫ్ట్ గా మారడానికి హెల్ప్ చేస్తుంది. ఆయిలీ స్కిన్ ఉన్న వారికి పింపుల్స్ ఎక్కువగా వస్తాయి. అందుకే, వారికి స్కిన్ సూతింగ్ ఇంగ్రిడియెంట్స్ అవసరం.

# మెట్రో రైలు ప్రాజెక్టు పేరుతో ఫ్లైఓవర్లకు మంగళం

## భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలంటే చుక్కలే...



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి పెట్టుబడులు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి లోకేశ్‌ల కృషితో కలలో కూడా ఊహించని కంపెనీలు వస్తున్నాయి. కేవలం ఏడాదిన్నర కాలంలో గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్, సిఫీ, ఏఎన్ఎస్ఆర్ వంటి ఐటీ సంస్థలను విశాఖపట్నం తీసుకువచ్చారు. వీటి ద్వారా భవిష్యత్తులో లక్షల మందికి ఉపాధి లభించనుంది. అయితే ఈ కంపెనీల ద్వారా విశాఖపట్నంలో పెరిగే జనాభాకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే దిశగా మాత్రం ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టడం లేదు. ప్రైవేటు సంస్థలు రూ.లక్షల కోట్లు పెట్టడానికి ముందుకు వస్తున్నప్పుడు ప్రభుత్వం అందుకు తగిన రీతిలో మౌలిక వసతుల ప్రాజెక్టులపై నిధులు వెచ్చించాలి. కానీ ఆ ప్రస్తావన, ప్రణాళిక ఎక్కడా కనిపించడం లేదు. ఏ ప్రజా ప్రతినిధి, జిల్లా అధికారులు వీటిపై పెదవి విప్పడం లేదు. దీనిపై సీఎం, ఐటీ మంత్రి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది అక్టోబరుకల్లా ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రభుత్వమే చెబుతోంది. మరుక్షణం విశాఖ విమానాశ్రయంలో పౌర విమానాల రాకపోకలు ఆపేస్తామని తూర్పు నౌకాదళం అంటోంది. అంటే విశాఖపట్నం వాసులంతా హైవే మీదుగానే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలి. విశాఖలో లంకెలపాలెం మొదలుకొని ఆనందపురం వరకూ హైవేపై అనేక జంక్షన్లు ఉన్నాయి. ట్రాఫిక్ చాలా దారుణంగా ఉంటుంది. వీటిలో లంకెలపాలెం, గాజువాక, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, హనుమంతవాక, ఎండాడ, పీఎం పాలెం కారుషెడ్ జంక్షన్, కొమ్మాది, ఆనందపురం జంక్షన్లు దాటాలంటే చాలా సమయం పడుతుంది. ఈ జంక్షన్లలో ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. దీనికి నేషనల్ హైవే అథారిటీ కూడా ముందుకు వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం 'ఆకాశంలో మబ్బులు చూసి ముంతలో నీళ్లు ఒలకబోసుకున్న' చందంగా వ్యవహరిస్తోంది. విశాఖపట్నంలో స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు నిర్మించే మెట్రో రైలు ప్రాజెక్టులో వీటిని చేర్చి డబుల్ డెక్కర్ విధానంలో నిర్మాణాలు చేపడతామని కొత్త పల్లవి అందుకుంది. దీనివల్ల భూసేకరణ సమస్యలు తప్పడంతో పాటు నిధులు ఆదా అవుతాయని అంటోంది. ఈ మెట్రో రైలు ప్రాజెక్టు పదేళ్లగా నలుగుతోంది. ఇప్పటికీ దానికి పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించలేదు. ఆ ప్రాజెక్టుకు సుమారు రూ.12 వేల కోట్లు అవసరం. డబుల్ డెక్కర్ చేరిస్తే మొత్తం రూ.15 వేల కోట్లు కావాలి. అన్ని నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేవు. కేంద్రాన్ని అడుగుతోంది. వారు ఎప్పుడు కనికరిస్తారో తెలియదు. ప్రాజెక్టు ఎప్పుడు మొదలై...ఎప్పటికి పూర్తవుతుంతో అంచనాలు లేవు. ఇంతా చేస్తే మెట్రో రైలు ప్రాజెక్టు ఆర్థికంగా వెసులుబాటు కాదని హైదరాబాద్ మెట్రో ద్వారానే రుజువైంది. విశాఖపట్నం కంటే ఎన్నో రెట్లు పెద్దదైన హైదరాబాద్‌లోనే దానిని నిర్వహించలేక ఎల్ అండ్ టి వంటి సంస్థ చేతులెత్తేసిందంటే...విశాఖపట్నంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇవన్నీ అభివృద్ధిని అడ్డుకునే వ్యాఖ్యానాలు కావు. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలు. నిధులే లేని వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పేరు చెప్పి ఫ్లైఓవర్ల నిర్మాణం పక్కనపెడితే భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికి నరకం కనిపిస్తుంది. ఈ తిప్పలు లేకుండా వీఎంఆర్‌డీఏ ద్వారా మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నామని చెబుతున్నారు. వారు ప్రతిపాదించిన మార్గాలలో పినగాడి-వేపగుంట, అడవివరం-శొంఠ్యాం మార్గాలు మాత్రమే విమానాశ్రయానికి వెళ్లే వారికి ఉపయోగపడతాయి. మిగిలినవన్నీ లేఅవుట్లు మీదుగా నిర్మిస్తున్న రహదారులు. విమానాశ్రయానికి వెళ్లేవారికి ఆయా మార్గాల్లో ప్రయాణించాల్సిన అవసరం ఏర్పడదు. ఇది వాస్తవం. భోగాపురం విమానాశ్రయానికి టాక్సీలో వెళ్లడానికి ఒక వైపు రూ.2 వేలు చెల్లించాలి. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరులకు విమాన ప్రయాణం సమయం కంటే విశాఖ నుంచి భోగాపురం వెళ్లడానికే ఎక్కువ సమయం పడుతుంది. దీనిని గుర్తించి ఫ్లైఓవర్ల నిర్మాణం తక్షణమే ప్రారంభించాల్సి ఉంది.

అదేవిధంగా పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా మౌలిక వసతులు పెంచాలి. ఐటీ పార్కుల్లో ఉద్యోగుల సంఖ్య వేలల్లో పెరుగుతుంది. ఆఫీసు నుంచి బయటకు వచ్చేవారు బస్సుల కోసం నిల్చోడానికి కనీసం బస్టాప్ కూడా లేదు. తినడానికి తిండి, వెళ్లడానికి రవాణా సౌకర్యాలు లేకపోతే చివరకు మిగిలేవి విమర్శలే. డేటా సెంటర్లకు భారీగా నీరు కావాలి. పోలవరం ఎడమ కాలువ నుంచి తీసుకువస్తామని చెబుతున్నారు. ఎక్కడికక్కడ నిల్వ చేయడానికి రిజర్వాయర్లు కావాలి. వాటి నిర్మాణానికి కూడా ప్రణాళికలు లేవు. జిల్లాలో నాయకుల మధ్య సమన్వయలోపం ఉంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు విశాఖపై ప్రత్యేక దృష్టి పెడితేనే వారి కృషికి తగిన ఫలితాలు వస్తాయి. జిల్లా అధికారులు ప్లానింగ్ కొంత వరకే ఉంది. వాటిని కూడా ఆచరణలో పెట్టడానికి నిధుల సమస్య ఉంది.

# అమెరికాలో శాశ్వత నివాసానికి గోల్డ్ కార్డ్ వీసా విక్రయాలు ఆరంభం



**వాషింగ్టన్ :** అమెరికాలో శాశ్వత నివాసం కావాలనుకునేవారికి గోల్డ్ కార్ట్ వీసా విక్రయాలను ట్రంప్ ప్రభుత్వం ప్రారంభించింది. తద్వారా తన ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పును తీసుకువచ్చింది. ట్రంప్ ఆంక్షలతో ఇబ్బందులు పడుతున్న అధిక నైపుణ్యాలు కలిగిన వర్కర్లకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. అన్ని రకాల వలసలపై పెద్ద ఎత్తున ఆంక్షలు విధించి వారిని ఆయా దేశాలకు తరలిస్తున్న నేపథ్యంలో ఈ పథకాన్ని నెలల తరబడి కసరత్తు చేసి మరీ అమెరికా ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణకు ఆన్‌లైన్ పోర్టల్ సిద్ధమైంది. అభ్యర్థులు ముందుగా 15వేల డాలర్లను ప్రాసెసింగ్ చార్జిగా చెల్లించాల్సి వుంటుంది. ఆ తర్వాత 10లక్షల డాలర్లను (9.04 కోట్ల రూపాయలు) గోల్డ్ కార్ట్ వీసా కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంటుంది. అయితే ఈ చెల్లింపులను కంట్రిబ్యూషన్ లేదా గిఫ్ట్‌గా ప్రభుత్వం చెబుతుంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే వారి నేపథ్యాన్ని ఫెడరల్ అధికారులు దర్యాప్తు చేసి అంతా సవ్యంగా వుంటే వారికి శాశ్వత నివాస హోదాను అమెరికా కల్పించనుంది. అమెరికా అధ్యక్షుడు స్వయంగా దీన్ని ప్రకటిస్తూ "ప్రాధమికంగా ఇది గ్రీన్ కార్డే. అంతకంటే ఇంకా మెరుగైనది, శక్తివంతమైనది, పటిష్టమైన పంథా కలిగినది కూడా" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అలాగే మన దేశంలోకి గొప్ప వ్యక్తులు రావడం మంచి విషయం భారత్ , చైనా , యూరప్ దేశాలకు తిరిగి వెళ్లిపోతున్న ప్రతిభావంతులు ఇప్పుడు అమెరికాలోనే ఉండొచ్చు అని ట్రంప్ ప్రకటించారు. అయితే ఇది సంపన్నులకే ఉపయోగపడుతుందని, ఎగువ మధ్య తరగతికి డాలర్ డ్రీమ్స్ దూరమైనట్లేనని పలువురు భావిస్తున్నారు.




# ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా: సూర్యకుమార్



సౌతాఫ్రికాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో 51 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. ఈ ఓటమికి బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తమ వైఫల్యమే కారణమని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంగీకరించాడు. తమ ప్రణాళికలు విఫలమైనప్పుడు, ప్రత్యామ్నాయ వ్యూహాలు అమలు చేయడంలో వెనుకబడ్డామని స్పష్టం చేశాడు. ఈ ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని మూడో మ్యాచ్‌లో పుంజుకుంటామని ధీమా వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ మాట్లాడుతూ.. "మేం మొదట బౌలింగ్ చేశాం. ఈ వికెట్‌పై సరైన లెంగ్త్‌లో బంతులు వేయడంలో విఫలమయ్యాం. మా ప్లాన్-ఎ పనిచేయనప్పుడు, మా వద్ద ప్లాన్-బి సిద్ధంగా లేదు. మంచు ప్రభావం ఉన్నప్పటికీ, మేం మరింత మెరుగ్గా బౌలింగ్ చేయాల్సింది. ఈ అనుభవం మాకు ఒక పాఠం" అని తెలిపాడు. బ్యాటింగ్ గురించి మాట్లాడుతూ.. "ఛేదనలో మేం తెలివిగా ఆడలేకపోయాం. శుభ్‌మన్ గిల్, నేను జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాల్సింది. ప్రతీసారి అభిషేక్ శర్మపైనే ఆధారపడలేం. శుభ్‌మన్ తొలి బంతికే ఔటయ్యాక, నేను మరింత బాధ్యతగా ఆడి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాల్సింది. కానీ అలా జరగలేదు" అని సూర్యకుమార్ తన వైఫల్యాన్ని ఒప్పుకున్నాడు.

అక్షర్ పటేల్‌ను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపడంపై కూడా సూర్య స్పందించాడు. "గత మ్యాచ్‌లో అక్షర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఆ ఫామ్‌ను కొనసాగిస్తాడనే నమ్మకంతోనే అతడికి ప్రమోషన్ ఇచ్చాం. కానీ దురదృష్టవశాత్తు ఆ వ్యూహం ఫలించలేదు" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ (62) మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో భారత జట్టు 162 పరుగులకే ఆలౌట్ అయింది.

## టీమిండియాతో జరిగిన రెండో టీ-20లో

# దక్షిణాఫ్రికా విజయం



భారత్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఘనంగా పుంజుకుంది. తొలి మ్యాచ్‌లో 74 పరుగులకే కుప్పకూలిన ఈ జట్టు జరిగిన రెండో టీ20లో తడాఖా చూపింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (46 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 90) తన పేలవ ఫామ్‌కు చెక్ పెడుతూ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో 51 పరుగుల తేడాతో నెగ్గిన సౌతాఫ్రికా సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ఆదివారం మూడో టీ20 జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఫెరీరా (16 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 30 నాటౌట్), మిల్లర్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 20 నాటౌట్) ఆఖర్లో మెరుపు వేగంతో ఆడారు. మార్క్రమ్ (29) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్ వరుణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 19.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది.

తిలక్ వర్మ (34 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 62) ఒక్కడే రాణించాడు. బార్ట్‌మన్‌కు నాలుగు.. యా న్సెన్, ఎన్‌గిడి, సిపమ్లాలకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్వింటన్ డికాక్ నిలిచాడు. మంచు ప్రభావం అధికంగా ఉండడంతో భారత బ్యాటర్లు కూడా చెలరేగుతారని ఆశించినా.. సఫారీ బౌలర్లు వారికి ముకుతాడు వేశారు. తొలి ఓవర్ నుంచే వికెట్ల పతనం సాగడంతో ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేకపోయింది. తిలక్ వర్మ ఒక్కడే పోరాటం సాగించాడు. గిల్ (0), అభిషేక్ (17), సూర్యకుమార్ (5) పవర్‌ప్లేలోనే వెనుదిరగడం దెబ్బతీసింది. వన్‌డౌన్‌లో అక్షర్ (21) బరిలోకి దిగినా ఫలితం లేకపోయింది. హార్దిక్ (20)తో కలిసి ఐదో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. అయితే గెలిచే అవకాశం లేకపోయినా.. నాలుగు పరుగుల వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లు నేలకూలడం గమనార్హం.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఆరంభం నుంచే రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. డికాక్ ఆరంభంలో అర్ష్‌దీపను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో అదరగొట్టాడు. వరుణ్ వెంటనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (8)ను బౌల్డ్ చేశాడు. 26 బంతుల్లోనే డికాక్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కెప్టెన్ మార్క్రమ్ వరుణ్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదినా అతడికే చిక్కడంతో రెండో వికెట్‌కు 47 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. హార్దిక్ ఓవర్‌లో 4,6తో 90కి చేరిన డికాక్ సెంచరీ ఖాయమనిపించినా.. వరుణ్ ఓవర్‌లో రనౌటయ్యాడు. ఆ వెంటనే బ్రెవిస్ (14)ను అక్షర్ అవుట్ చేసినప్పటికీ.. మిల్లర్, ఫెరీరా జోడీ ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. ఆఖరి ఓవర్‌లో ఫెరీరా రెండు సిక్సర్లతో 18 రన్స్ అందించి స్కోరును 200ం దాటించాడు. ఐదో వికెట్‌కు ఈ జోడీ 23 బంతుల్లోనే అజేయంగా 53 పరుగులు చేసింది.

భారత్: అభిషేక్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 17, గిల్ (సి) హెన్‌డ్రిక్స్ (బి) ఎన్‌గిడి 0, అక్షర్ (సి) హెన్‌డ్రిక్స్ (బి) బార్ట్‌మన్ 21, సూర్యకుమార్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 5, తిలక్ (సి) మార్క్రమ్ (బి) ఎన్‌గిడి 62, హార్దిక్ (సి) బ్రెవిస్ (బి) సిపమ్లా 20, జితేశ్ (సి) బార్ట్‌మన్ (బి) సిపమ్లా 27, దూబె (బి) బార్ట్‌మన్ 1, అర్ష్‌దీప్ (సి) మిల్లర్ (బి) బార్ట్‌మన్ 4, వరుణ్ (సి) మార్క్రమ్ (బి) బార్ట్‌మన్ 0, బుమ్రా (నాటౌట్) 0 ఎక్స్‌ట్రాలు: 5 మొత్తం: 19.1 ఓవర్లలో 162 ఆలౌట్.




# 'అఖండ 2'

## సినిమా రివ్యూ



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌కు సూపర్‌హిట్ జోడి అనే పేరుంది. ఈ ఇద్దరి కలయికలో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. తాజాగా ఈ సక్సెస్‌ఫుల్ ద్వయం మరోసారి కలిసి చేసిన సినిమా 'అఖండ 2 తాండవం'. విజయవంతమైన 'అఖండ'కు సీక్వెల్‌గా రూపొందిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి, ఈ చిత్రం ట్రైలర్ కూడా ఆకట్టుకోవడంతో సినిమాపై అటు ప్రేక్షకుల్లో, ఇటు బాలకృష్ణ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ నెల 11న ప్రీమియర్స్‌తో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుందా? బాలకృష్ణ-బోయపాటి శ్రీనుల జోడీ మరోసారి బ్లాక్‌బస్టర్ అందుకుందా? లేదా ఈ చిత్ర సమీక్షలో తెలుసుకుందాం..

**కథ:** శివుడిని ఆరాధిస్తూ, ఆయన నామస్మరణంతోనే ఉంటున్న అఘోరా అఖండకు (బాలకృష్ణ) గురువైన మురళీమోహన్ రాబోయే ఆపద నుంచి భారతదేశాన్ని, హిందు ధర్మాన్ని రక్షించాలంటే మరిన్ని శక్తులను ఆ శివుడి నుండి పొందటం కోసం అఖండను కఠోరమైన సాధన చేయమని కోరతాడు. భారతదేశాన్ని దెబ్బతీయాలంటే.. భారతీయుల సనాతన ధర్మాన్ని దెబ్బతీసి, తద్వారా ప్రజల్లో దేవుడి మీద ఉన్న నమ్మకం తీసేయాలని, అప్పుడే భారత్‌పై దాడి చేసి భారతదేశాన్ని అక్రమించాలని టిబెట్ దేశ జనరల్‌తో పాటు చాంగ్ కలిసి ప్లాన్ వేస్తారు. ఇందుకోసం ఠాకూర్ కూడా వీళ్లతో చేతులు కలుపుతాడు.

ఇందుకోసం వీళ్లు ఎంచుకున్న మార్గం ఏమిటి? సనాతన ధర్మాన్ని, ప్రజలను అఖండ ఎలా రక్షించాడు? మురళీకృష్ణ ( (రెండో బాలకృష్ణ) కూతురుగా నటించిన హర్షలి మల్హోత్రా పాత్ర ఏమిటి? సంయుక్త మీనన్‌కు కథకు సంబంధం ఏమిటి? విషాచీ (ఆది), అఖండల మధ్య జరిగిన యుద్ధం ఏమిటి? చివరకు ఏం జరిగింది? అఖండ రూపంలో శివయ్య దేశాన్ని, ప్రజలను ఎలా రక్షించాడు అనేది మిగతా కథ.

**విశ్లేషణ:** అఖండకు కొనసాగింపుగా దర్శకుడు బోయపాటి శ్రీను ఈ కథను అల్లుకున్నాడు. సనాతన ధర్మం, బయోవార్, దైవత్వం ఇలా అన్ని కోణాల్లో ఆసక్తికరమైన సన్నివేశాలతో ఓ కమర్షియల్ సినిమాకు కావాల్సిన హంగులన్నీ సమకూర్చుకున్నాడు. ముఖ్యంగా ఎక్కడా కూడా సినిమాపై ఆసక్తి తగ్గకుండా ప్రేక్షకులకు, బాలకృష్ణ అభిమానులకు హై ఇచ్చే సన్నివేశాలను రాసుకున్నాడు. తొలిభాగంలో మురళీ కృష్ణ (చిన్న బాలకృష్ణ)పై యాక్షన్ సన్నివేశాలు, అఖండ సనాతన ధర్మం గురించి చెప్పే సీన్‌లు సినిమాపై ఆసక్తిని పెంచుతాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలు ఎంతో పవర్‌ఫుల్‌గా చిత్రీకరించారు. ఇక సెకండాఫ్ సినిమాకు కీలకంగా ఉంటుంది.

ప్రతి సన్నివేశం ఆడియన్స్‌ను మెస్మరైజ్ చేసేలా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాల విషయంలో లాజిక్‌లు పట్టించుకోకపోతే అవి అతిశయంగా అనిపించినా వాటిని డిజైన్ చేసిన, విధానం అందర్ని అబ్బురపరుస్తుంది.

సెకండాఫ్ కొంచెం నిడివి ఎక్కువగా అనిపించినా, ఎక్కడా కూడా ఆడియన్స్‌కు బోర్ కొట్టకుండా దర్శకుడు బోయపాటి శ్రీను ప్రతి సన్నివేశాన్ని ఎంతో జాగ్రత్తగా రాసుకోవడంతో పాటు ఆయన ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. సినిమాలో ఇంటర్వెల్‌తో పాటు పతాక సన్నివేశాలు చిత్రీకరించిన తీరు అందరిని మెస్మరైజ్ చేస్తుంది.

**నటీనటుల పనితీరు:** అఖండగా బాలకృష్ణ నటన ఎంతో ప్రశంసనీయం. ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లుగా ఉంటుంది. అఖండలో బాలకృష్ణను తప్ప ఇంకెవ్వరినీ ఊహించుకోలేం. ఆయన కనిపించిన ప్రతి సన్నివేశం థియేటర్‌లో ఆడియన్స్‌కు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. సంయుక్త మీనన్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో తన పరిధి మేరకు నటించింది. బాలకృష్ణ కూతురు పాత్రలో హర్షలి మల్హోత్రా పాత్రలో ఓ తెలుగమ్మాయిని తీసుకుంటే, ఆ పాత్ర బలంగా అనిపించేంది.


విలన్‌గా ఆది పినిశెట్టి నటన అలరిస్తుంది. ఈ చిత్రంతో దర్శకుడిగా బోయపాటి శ్రీను తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు. బాలకృష్ణను ఇలాంటి పవర్‌ఫుల్ పాత్రల్లో చూపించడంలో ఆయనకు మించిన వారు లేరు అనే రీతిలో బోయపాటి ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ సినిమాకు తమన్ నేపథ్య సంగీతం ప్రాణంగా నిలిచింది. యాక్షన్ సన్నివేశాల్లో ఆయన నేపథ్య సంగీతం సన్నివేశాల స్థాయిని పెంచింది. ఫోటోగ్రఫీ సినిమాకు వన్నె తీసుకొచ్చింది. సీజీ వర్క్, గ్రాఫిక్స్ చాలా సహజంగా అనిపించాయి.

'అఖండ 2 తాండవం' అన్నికమర్షియల్ హంగులతో రూపొందిన పైసా వసూల్ సినిమా. డివోషనల్ టచ్‌తో హై వోల్టేజ్ యాక్షన్ సినిమాగా తెరకెక్కిన ఈ సినిమాలో లాజిక్‌లు వదిలేసి సినిమాను సినిమాగా చూడాలనుకునే వారికి ఈ సినిమా నచ్చుతుంది. ముఖ్యంగా బాలకృష్ణ అభిమానులకు ఈ సినిమా మంచి సంతృప్తినిస్తుంది.



### 75 ఏళ్లలోనూ.. బాక్సాఫీస్ కింగ్

# 'రజనీకాంత్'



తన స్టైల్, నటనతో కోట్లాది అభిమానులను సొంతం చేసుకున్నారు సూపర్ స్టార్ రజనీకాంత్. 50ఏళ్ల సుదీర్ఘమైన తన సినీ ప్రయాణంలో అనేక హిట్ సినిమాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. తమిళంలోనే కాదు తెలుగులోనూ ఆయనకు డైహార్డ్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆయనను ఫ్యాన్స్ ముద్దుగా 'తలైవా' అని పిలుచుకుంటారు. అయితే ఈ క్రేజ్ ఒక్క రాత్రిలో వచ్చింది కాదు. దీని వెనుక ఆయన చేసిన కృషి ఎంతో ఉంది. మరి ఆయన సినీ జర్నీ ఏంటి? ఎన్ని ఒడుదొడుకులు దాటుకొని ఈ స్థాయికి వచ్చారు? అనే విషయాలపై శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఓ లుక్కేద్దాం! రజనీ అనేది మూడక్షరాల పేరే కావొచ్చు, కానీ ఆ పేరు వెనుక అక్షరాలతో కూడా వర్ణించలేని స్టార్ డమ్, స్టైల్ ఉంది. ఆయన వెండితెరపై కనపడితే చాలు అభిమానులకు పూనకాలే. అంతలా తన స్టైల్, మేనరిజంతో రజనీ ఆకట్టు కుంటారు. అందుకే రజనీకి ఇండియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా భాష, ప్రాంతంతో సంబంధంతో లేకుండా ఫ్యాన్స్ ఉంటారు. కొన్ని కంపెనీలు సూపర్ స్టార్ సినిమా రిలీజ్ నాడు ఏకంగా ఉద్యోగులు సెలవు ఇచ్చిన సందర్భాలు ఉన్నా యి. అయితే రజనీకి ఈ సక్సెస్ అంత ఈజీగా రాలేదు. కెరీర్ తొలినాళ్లలో విలన్ పాత్రల్లో నటించి, అచెంలంచెలుగా ఉన్నత శిఖరాలకు ఎదిగారు. ఇప్పుడు భారీ స్టార్ డమ్‌ను సొంతం చేసుకున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**